



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 23 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా గురువారం 5 ఫిబ్రవరి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 23 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, THU 5 FEBRUARY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## ముగిసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భేటీ

### రెండున్నర గంటలపాటు సాగిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమావేశం

- వైసీపీ కుట్రలు, కూటమి సమన్వయంపై ప్రధానంగా చర్చ
- రాజ్యసభ స్థానాలు, నామినేటెడ్ పదవుల భర్తీపై సమాలోచనలు
- క్షేత్రస్థాయిలో ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయం



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య అమరావతిలో జరిగిన కీలక భేటీ ముగిసింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, కూటమి పక్షాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు.ప్రధానంగా, వైసీపీ అనుసరిస్తున్న వైఖరి పైనే ఈ సమావేశంలో ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కుల రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని, ఆ పార్టీ పన్నుతున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కో వాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా కూటమి శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని తీర్మానించుకున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు ఓ అభిప్రాయానికి వచ్చారు.ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు పరిపాలనాపరమైన విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీపై నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అలాగే, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపై కూడా సమాలోచనలు జరిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదం వంటి అంశాలపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని

- మిగతా2లో



## ఆ విషయం తెలియని వాళ్లు నాకు క్యాన్సర్ అని రాశారు

- క్యాన్సర్‌పై అవగాహన పెంచాలని మెగాస్టార్ పిలుపు
- నిర్లక్ష్యం వల్లే ముప్పు.. ముందస్తు గుర్తింపుతోనే రక్షణ
- తనకు జరిగిన కోలనోస్కోపీ టెస్టుపై ఆసక్తికర వ్యాఖ్యలు
- అవగాహన కోసం షార్ట్ ఫిలిమ్స్ తీస్తానన్న చిరంజీవి

- మిగతా2లో

## రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది



- అంబటి రాంబాబు ఇంటికి వెళ్లిన జగన్... కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం
- మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన జగన్
- మూడేళ్లలో తిరిగి అధికారంలోకి వస్తామని కూటమికి ఘాటు హెచ్చరిక
- టీడీపీ శ్రేణుల దాడిలో ధ్వంసమైన అంబటి ఇంటిని, వాహనాలను పరిశీలన
- తిరుమల నెయ్యి వివాదంపై స్పందిస్తూ చంద్రబాబుపై విమర్శలు

**పెన్ పవర్ డెస్క్:** గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని, జంగిల్ రాజ్ నడుస్తోందని జగన్ తీవ్రంగా విమర్శించారు. దాడులు చేసిన వారిని వదిలేసి, బాధితులపైనే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం నాడు గుంటూరు పర్యటనలో భాగంగా, ఇటీవల దాడికి గురైన అంబటి నివాసానికి వెళ్లిన జగన్, ధ్వంసమైన ఇంటిని, వాహనాలను పరిశీలించారు. గుడి నుంచి వస్తున్న అంబటిపె

- మిగతా2లో



## మాకంటే వారి వద్దే శక్తిమంతమైన ఆయుధాలు

- బలూచ్ తిరుగుబాటుదారుల వద్ద అమెరికన్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలు ఉన్నాయి
- బలూచ్ తిరుగుబాటుదారుల వద్ద ఉన్న ఆయుధాలు తమ సైన్యంలో కూడా లేవన్న ఆసిఫ్
- ఈ ఆయుధాలు వారికి ఎక్కడి నుంచి వస్తున్నాయన్న పాక్ రక్షణ మంత్రి
- వీరిపై పాక్ సైన్యం పూర్తి స్థాయిలో దాడి చేస్తుందని వెల్లడి

- మిగతా2లో



## పవన్ ఆంధ్రాలో రాజకీయాలు చేసుకోవాలి..

### ఇక్కడ ఆయన మాట విని ఓటేసే వారు లేరు: మహేశ్ గౌడ్

- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరపున పవన్ ప్రచారం చేస్తారంటూ వార్తలు
- పవన్ తెలంగాణ వ్యతిరేకి అని ఆరోపించిన మహేశ్ గౌడ్
- పవన్‌ను బీజేపీ నేతలు ‘భిక్షాం దేహీ‘ అని అడిగారంటూ ఎద్దేవా

- మిగతా2లో

## 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

- గుర్తింపు మోసాలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు
- దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్ల మంది ఆధార్ నంబర్ల రద్దు
- పార్లమెంటులో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద
- ఆధార్ భద్రతకు బయోమెట్రిక్ లాక్, ఫేస్ అథెంటికేషన్ ఫీచర్లు
- డేటాబేస్ శుద్ధీకరణలో భాగంగా యూఐడీఏఐ ఈ నిర్ణయం

- మిగతా2లో





## ఎన్‌హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించిన వైసీపీ

- ఏపీలో తమ నేతలపై దాడులంటూ ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు
- మాజీ మంత్రుల ఇళ్లపై దాడులు, దళిత కార్యకర్త హత్యపై విచారణకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాజ్యాంగ వ్యవస్థ బలహీనపడిందని ఆరోపణ
- తమ ఫిర్యాదుపై కమిషన్ సానుకూలంగా స్పందించిందని తెలిపిన వైసీపీ నేతలు
- ఏపీకి నిజనిర్ధారణ కమిటీని పంపే అవకాశం ఉందని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ నేతల ఇళ్లపై జరిగిన దాడులు, ఒక దళిత కార్యకర్త హత్య ఘటనలపై వైసీపీ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ని ఆశ్రయించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సమగ్ర విచారణ జరపాలని కోరింది.బుధవారం నాడు ఢిల్లీలో వైసీపీ బృందం ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ జస్టిస్ వి. రామసుబ్రమణియన్‌ను

- మిగతా2లో





## ప్రభుత్వాలు శాశ్వతం కాదు

### రాజ్యసభలో కమల్ హాసన్ తొలి ప్రసంగం

- రాజ్యసభలో తొలిసారి ప్రసంగించిన నటుడు, ఎంపీ కమల్ హాసన్
- సినిమా ద్వారానే తాను పార్లమెంటుకు వచ్చానని వెల్లడి
- ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, అధికారం అశాశ్వతమని వ్యాఖ్య
- ద్రావిడ నేతలు పెరియార్, అన్నాదురైలను గుర్తు చేసుకున్న కమల్
- ప్రగతిశీల ప్రజాస్వామ్యంతో యువత ఎదగాలని పిలుపు

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (వీచీవీ) అధినేత కమల్ హాసన్ రాజ్యసభలో తన తొలి ప్రసంగంతో ఆకట్టుకున్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల్లో

- మిగతా2లో



## వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలి

- ఆదరణ-3 ద్వారా కులవృత్తులకు ఆధునిక పరికరాల పంపిణీకి చర్యలు
- రూ.60 కోట్ల సాస్కీ నిధులతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం
- బీసీ హాస్టళ్లలో మార్చిలోగా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం
- 6 జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్

- మిగతా2లో

వెనుకబడిన వర్గాలను (బీసీ) కేవలం సంక్షేమ లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా (మైక్రో ఎంట్రప్రె న్యూర్లు), ఎంఎస్‌ఎంఈలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తుల వారికి ఆధునిక సాంకేతికతను అందించే లక్ష్యంతో ‘ఆదరణ-3‘ పథకం ద్వారా ఆధునిక పనిముట్లను పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడంపై

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..




### ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ

- 2020-24 మధ్య కాలంలో ఎయిడ్స్ కారణంగా దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది మృతి
- ఏపీలో 32,642 మంది... తెలంగాణలో 11,498 మంది మృతి
- విదేశీ తరహా జీవనశైలి వల్ల ఐటీ రంగంలో విస్తరిస్తున్న వైరస్

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# సామాన్యుడికి అభయం లేని బడ్జెట్!

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దీర్ఘకాలిక ప్రణాళికల్ని చూపిస్తూ.. 'సామాన్యులను ప్రస్తుతానికి ఇలాగే సర్దుకోండి' అన్నట్టు ఉంది. ఆర్థిక సర్వే ప్రకారం దేశ ఆర్థిక వ్యవస్థ నిలకడగా, పటిష్టంగా ఉంది. కనుక ఆ ప్రభావంతో బడ్జెట్‌లో ప్రజలకు నేరుగా మంచి ప్రయోజనాలు ఉండొచ్చని ఆశించిన వారికి భంగపాటు అయింది. ఈసారి ద్రవ్యలోటుని అదుపులో ఉంచడం, రానున్న రోజుల్లో స్థూల ఆర్థిక వ్యవస్థను బలీయంగా ఉంచడానికి ప్రయత్నించడమన్నవి ప్రాధాన్యతలుగా మారి, సంక్షేమం, ఆర్థిక సమానత్వంతో కూడిన వృద్ధి అన్నవి వెనక బడ్డాయి.. జన సామాన్యానికి కొత్త పథకాలు, అభయం ఇచ్చే హామీలు, కేటాయింపులు లేవు.. దేశీయ మౌలిక వసతులు ఏర్పాటు, పరిశ్రమలకు ఊతం కల్పిస్తూ మూలధన వ్యయం పెంచుతున్నట్లు ప్రకటించారు.. ఆ దిశగా 12 లక్షల కోట్లు ప్రతిపాదన చెయడం ఇదే మొదటిసారి.. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం బాగుంది. కానీ ఎగుమతుల విషయంలో ప్రపంచ పరిణామాల మధ్య ఎంతమేరకు వర్కవుట్ అవుతుందో చూడాలి. బడ్జెట్‌లో తలపెట్టిన హై స్పీడ్ కారిడార్లు, ఖనిజ కారిడార్లు, పర్యాటక రంగంపై ఫోకస్ ద్వారా అవి తెచ్చే లాభాలకు, పరోక్షంగా వాటివల్ల ప్రజలకు, పర్యావరణానికి, హక్కులకు కలిగే నష్టాలతో బేరీజు వేసి వాస్తవ స్థితిని చూడాల్సి ఉంటుంది. విద్యా, నైపుణ్య రంగాలకు కేటాయింపులు బాగానే ఉన్నా, భవిష్యత్‌ని, ఉపాధిలేమి, నిరుద్యోగితని దృష్టిలో పెట్టుకుంటే ఇంకా చాలా అవసరం. విద్యా వైద్య రంగాలకు కేటాయింపులు అవసరమైన స్థాయిలో లేవు.. బడుగు వర్గాల సంక్షేమం కూడా ఆశించిన స్థాయిలో కేటాయింపులను నోచుకోలేదు.. రాష్ట్రాలకు పన్నుల్లో వాటా పెంచాల్సింది. సంపన్నులకు కొంచెం బాధ్యత పెంచి, సామాన్యులకు కొంచెం భారం తగ్గిస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మంచి జరిగేది. మొత్తానికి త్రీడీ కళ్లద్దాలతో చూస్తే దారి చివర నున్నటి భవనం. కానీ నడవ దానికి మాత్రం గతుకుల రోడ్డు ఉన్నట్టుంది.

# వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలి

- మొదటి పేజి తరువాయి

సమీక్షలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.60 కోట్ల సాస్కీ నిధులతో కొత్తగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉన్న 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హాస్టళ్లలో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన వంటి అన్ని అంశాల్లోనూ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అనుసరించాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని పర్యవేక్షించేందుకు వీలుగా అపార్ (ఆూూ=) ఐడీలను నమోదు చేసి, అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న బీసీ భవనాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో నడుస్తున్న 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిళ్లను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి ప్రయోజనం చేకూరేలా పథకాలు రూపొందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# ఆ విషయం తెలియని వాళ్లు నాకు క్యాన్సర్ అని రాశారు

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్యాన్సర్‌పై అవగాహన, ముందస్తు గుర్తింపు ప్రాధాన్యత గురించి మాట్లాడుతూ, కొన్ని కీలకమైన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. క్యాన్సర్‌పై పోరాటాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన ఆరోగ్యం గురించి ఓ ఆసక్తికర విషయాన్ని చిరంజీవి వెల్లడించారు. తాను ఎంతో ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తానని, అయినా ముందుజాగ్రత్తగా కోలనోస్కోపీ పరీక్ష చేయించుకున్నానని తెలిపారు. ఆ పరీక్షలో నాన్-క్యాన్సరస్ పాలిప్స్ (అశీఅ-ఝఅఎవతీశీబం జూశీశ్రీఎజూం) కనపడటంతో వాటిని తొలగించారని చెప్పారు. అయితే, దీనిపై అవగాహన లేని కొందరు జర్నలిస్టులు తనకు క్యాన్సర్ వచ్చిందని, దాని నుంచి బయటపడ్డానని రాశారని, అది వాస్తవం కాదని స్పష్టం చేశారు. క్యాన్సర్‌గా మారే చిన్న అవకాశాన్ని కూడా తీసుకోకూడదనే ఉద్దేశంతోనే ఆ పరీక్ష చేయించుకున్నానని అన్నారు. అలాగే, తాను క్రమం తప్పకుండా పీఎస్ఏ (ూూూ) వంటి పరీక్షలు చేయించుకుంటూ ఉంటానని తెలిపారు. శరీరం చెప్పే మాటను వినాలని, 'నాకు రాదులే' అనే నిర్లక్ష్యం పనికిరాదని చిరంజీవి గట్టిగా చెప్పారు. తన స్నేహితుడు ఒకరు లంగ్ క్యాన్సర్ బారిన పడినా, తొలిదశలోనే గుర్తించడం వల్ల చికిత్సతో బయటపడి గత పదేళ్లుగా ఆరోగ్యంగా జీవిస్తున్నారని ఉదహరించారు. జీవనశైలి, వాతావరణం, వంశపారంపర్య కారణాల వల్ల ఎవరికైనా క్యాన్సర్ రావొచ్చని, కానీ 90 శాతం కేసుల్లో తొలిదశలో గుర్తిస్తే నయం చేయవచ్చని వివరించారు.

ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించాలని చిరంజీవి కోరారు. 9 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ (నూఎ) వ్యాక్సిన్ వేయిస్తే, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (ఛవతీఙఱఛ్శీ ఝఅఛవతీ) బారిన పడకుండా 100 శాతం రక్షించవచ్చని వైద్యులు చెబుతున్నారని గుర్తుచేశారు. 45 ఏళ్లలోపు మహిళలు కూడా ఈ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని సూచించారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గర్భాశయ సంబంధిత సమస్యలను కూడా ముందుగానే గుర్తించవచ్చని ఆయన అన్నారు. భారత్‌లో ప్రతి సంవత్సరం 14 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, ప్రతి నిమిషానికి ముగ్గురు ఈ వ్యాధి బారిన పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చాలంటే పోలియో, మశూచి నిర్మూలన తరహాలో క్యాన్సర్‌పై కూడా ఒక ఉద్యమంలా పోరాడాలని పిలుపునిచ్చారు. పొగాకు, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తనవంతు బాధ్యతగా భవిష్యత్తులో షార్ట్ ఫిలిమ్స్ నిర్మించడానికి సిద్ధంగా ఉన్నానని చిరంజీవి ప్రకటించారు. ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని కలిసిన కొద్దిరోజులకే కిమ్స్ నుంచి ఆహ్వానం రావడం దైవ సంకల్పంగా భావించానని, అందుకే వెంటనే అంగీకరించానని తెలిపారు.

# 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

గుర్తింపు మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకు పైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బుధవారం పార్లమెంటుకు తెలిపారు. ఆధార్ డేటాబేస్ కచ్చితత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ సుమారు 134 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. మరణించిన వారి ఆధార్ నంబర్లను దుర్వినియోగం చేసి సంక్షేమ పథకాలను పొందడం, ఇతర మోసాలకు పాల్పడటం వంటివి నిరోధించడానికి ఈ డీయాక్టివేషన్ ప్రక్రియ చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు.

ఆధార్ దుర్వినియోగాన్ని తగ్గించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఖ×ణూ×) అనేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జితిన్ ప్రసాద తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారులు తమ బయోమెట్రిక్స్‌ను లాక్/అన్‌లాక్ చేసుకునే సదుపాయం, లావాదేవీల సమయంలో లబ్ధిదారు భౌతికంగా ఉన్నట్లు నిర్ధారించే 'లైవ్‌నెస్ డిటెక్షన్' ఫీచర్‌తో కూడిన ఫేస్ అథెంటికేషన్, ఆధార్ సెక్యూర్ క్యూఆర్ కోడ్, ఆఫ్‌లైన్ ఈ-కేవైసీ వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారుల ప్రధాన బయోమెట్రిక్ సమాచారాన్ని యూఐడీఏఐ ఎవరితోనూ పంచుకోదని, డేటాను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో భద్రపరచడం తప్పనిసరి చేసిందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రభుత్వాలు శాశ్వతం కాదు

- మొదటి పేజి తరువాయి

భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. "వివిధ రంగాలకు చెందిన వారు తమ ప్రజల తరఫున మాట్లాడేందుకు ఈ సభలోకి ప్రవేశించడానికి అనేక ద్వారాలు తెరుచుకుంటాయి. నాకు మాత్రం సినిమా ద్వారా ఆ ద్వారం తెరుచుకుంది" అని కమల్ హాసన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తనకు మద్దతిచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెరియార్, సి.ఎన్. అన్నాదురై, మహాత్మా గాంధీ వంటి మహనీయుల ప్రభావం తన ఆలోచనలు, రాజకీయాలపై ఉందని పేర్కొన్నారు.

"మా భాష, సంస్కృతి, హక్కులపై ఎలాంటి దాడి జరిగినా ఎదుర్కోవాలని నేర్పిన సి.ఎన్. అన్నాదురై నాకు తమిళాన్ని పరిచయం చేశారు" అని కమల్ గుర్తుచేసుకున్నారు. ప్రజాస్వామ్యంపై మాట్లాడుతూ, "ఈ ప్రజాస్వామ్య రథం భేదాభిప్రాయాలను అధిగమించి ముందుకు సాగాలి కానీ, ప్రజలను అణచివేయకూడదు. దానిని మేము అనుమతించం" అని హెచ్చరించారు.

ప్రపంచ చరిత్రలో ఏ ప్రభుత్వమూ శాశ్వతంగా నిలవలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అందుకు అతీతం కాదని స్పష్టం చేశారు. "పిల్లలు గమనిస్తున్నారు, జెన్-జీ తరం చూస్తోంది. ఎదుగుతున్న ప్రగతిశీల ప్రజాస్వామ్యంతో పాటు వారిని కూడా ఎదగనివ్వండి. అప్పుడే రేపటి భవిష్యత్తు మనదవుతుంది" అని యువతకు పిలుపునిచ్చారు. కమల్ హాసన్ ప్రసంగానికి సభ్యుల నుంచి మంచి స్పందన లభించింది.

# ఎన్‌హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించిన వైసీపీ

- మొదటి పేజి తరువాయి

కలిసి ఫిర్యాదు అందజేసింది. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై జరిగిన దాడులతో పాటు, దళిత కార్యకర్త హత్యకు సంబంధించిన వివరాలను కమిషన్‌కు సమర్పించింది. టీడీపీ శ్రేణులు పథకం ప్రకారమే ఈ దాడులకు పాల్పడ్డాయని, ప్రతిపక్ష నేతలను భౌతికంగా అంతమొందించే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను ఆధారాలుగా అందజేశారు.

సమావేశం అనంతరం వైసీపీ నేతలు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగాయని, మాజీ మంత్రులపై పెట్రోల్ బాంబులతో దాడికి యత్నించారని మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. దాడులు జరుగుతున్న సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని, రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ బలహీనపడిందని ఆదిమూలపు సురేష్ విమర్శించారు. కొందరు నేతలు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు.

తమ ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారని వైసీపీ నేతలు తెలిపారు. ఏపీ డీజీపీ నుంచి నివేదిక కోరడంతో పాటు, వాస్తవాలను తెలుసుకునేందుకు ఒక నిజనిర్ధారణ బృందాన్ని రాష్ట్రానికి పంపే అవకాశం ఉందని వారు వెల్లడించారు. ఈ బృందంలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి, మాజీ మంత్రులు తదితరులు ఉన్నారు. హత్యకు గురైన దళిత కార్యకర్త సల్మాన్ సోదరుడు కూడా తమ గ్రామంలో శాంతిని కాపాడాలని కమిషన్‌ను కోరారు.

# ముగిసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భేటీ

- మొదటి పేజి తరువాయి

సమష్టిగా తిప్పికొట్టాలని, ఇందుకోసం కూటమిలోని మూడు పార్టీల నేతలు కలిసి ఉమ్మడి మీడియా సమావేశాలు నిర్వహించాలని పవన్ సూచించినట్లు సమాచారం. రాబోయే 15 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగేలా పటిష్టమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలనే దిశగా కూడా వీరి మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది. నిన్న కేబినెట్ భేటీకి ముందు

చంద్రబాబు, పవన్ క్లుప్తంగా మాట్లాడుకున్నప్పటికీ, అన్ని అంశాలపై విపులంగా చర్చించేందుకు ఈరోజు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

# పవన్ ఆంధ్రాలో రాజకీయాలు చేసుకోవాలి..

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని ఘాటుగా వ్యాఖ్యానించారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలంగాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. "బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు" అని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటి వ్యక్తి మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించరని, ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది

- మొదటి పేజి తరువాయి

టీడీపీ కార్యకర్తలు కర్రలు, రాడ్లతో దాడి చేశారని, పోలీసుల సమక్షంలోనే కార్లను పగలగొట్టారని ఆరోపించారు. బాధితుడైన అంబటిని అరెస్ట్ చేసి, దాడి చేసిన వారికి స్టేషన్ బెయిల్ ఇవ్వడం దారుణమని అన్నారు.

ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, "ఇలాంటి దాడులతో వైసీపీ నాయకులను భయపెట్టగలమనుకుంటే మీ అంత మూర్ఖుడు లేడు. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదు. మూడేళ్లలో మా ప్రభుత్వం వస్తుంది. అప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం" అంటూ చంద్రబాబు ప్రభుత్వానికి ఘాటు వార్నింగ్ ఇచ్చారు. చేసిన తప్పులకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ లెక్కలు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం తిరుమల నెయ్యి వివాదంపై కూడా జగన్ స్పందించారు. నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని ల్యాబ్ నివేదికలు స్పష్టం చేశాయని, కేవలం తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే చంద్రబాబు కుట్రపూరితంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

# మాకంటే వారి వద్దే శక్తిమంతమైన ఆయుధాలు

పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ బలూచిస్థాన్‌లో జరుగుతున్న తిరుగుబాటు దాడులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) తిరుగుబాటుదారుల దగ్గర అమెరికన్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలు ఉన్నాయని, అవి పాక్ సైన్యంలో కూడా లేవని ఆయన జాతీయ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ఆసిఫ్ మాట్లాడుతూ, తిరుగుబాటుదారుల దగ్గర ఒక్కొక్కటి రూ.20 లక్షల విలువైన రైఫిల్స్, 4,0005,000ల డాలర్ల విలువైన థర్మల్ వెపన్ సైట్స్, నైట్ విజన్ డివైసెస్ ఉన్నాయని వెల్లడించారు. "ఇలాంటి రైఫిల్ మన సైన్యంలో లేదు. ఈ అమెరికన్ ఆయుధాలు వారికి ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరు డబ్బు చెల్లిస్తున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. బలూచ్ తిరుగుబాటుదారుల నాయకత్వం ఆఫ్ఘనిస్థాన్‌లో ఉందని, అక్కడి నుంచే తిరుగుబాటుదారులకు మద్దతు అందుతోందని ఆసిఫ్ ఆరోపించారు. బలూచిస్థాన్ ప్రావిన్స్ పరిమాణం పెద్దది కావడం, తిరుగుబాటుదారులు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఉపయోగించడం వల్ల భద్రతా బలగాలు కష్టపడుతున్నాయని ఆయన ఒప్పుకున్నారు. పాకిస్థానీ పంజాబీలను బీఎల్‌ఏ టార్గెట్ చేస్తోందని ఆసిఫ్ తెలిపారు. "వీరితో చర్చలు జరపలేము. పాక్ సైన్యం పూర్తి స్థాయిలో వారిపై దాడి చేస్తుంది" అని హెచ్చరించారు.

# తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..

ఏపీ, తెలంగాణల్లో ఎయిడ్స్ మరణాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. గత ఐదేళ్లలో హెచ్ఐవీ బారిన పడి మరణించిన వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం... 2020-2024 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది హెచ్ఐవీ కారణంగా చనిపోయారు. వీరిలో తెలుగు రాష్ట్రాల్లో మరణించిన వారి సంఖ్య 44,140గా ఉంది.

ఏపీలో 32,642 మంది చనిపోగా... తెలంగాణలో 11,498 మంది మృతి చెందారు. మరో షాకింగ్ విషయం ఏమిటంటే... ఐటీ రంగంలో హెచ్ఐవీ వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ విషయాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ వ్యవస్థ వెల్లడించింది. విదేశీ తరహా జీవనశైలికి అలవాటు పడటం ఐటీ రంగంలో హెఐవీ వ్యాప్తి కావడానికి కారణమవుతోందని తెలిపింది. ఈ రంగంలో హెచ్ఐవీ పరీక్షల సంఖ్యలను పెంచాల్సి ఉందని సూచించింది.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# రూ 13 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం

భట్టిప్రోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 4, మండల కేంద్రమైన భట్టిప్రోలు మెయిన్ రోడ్డు ను ఆధునికరించనున్నట్లు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు.బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వే గేటు వద్ద బాపట్ల వెల్లటూరు రోడ్డు వద్ద నుండి వెల్లటూరు ఛానల్ వంతెన వరకు 140 మీటర్ల పొడవు గల రోడ్డును 13 లక్షలతో ఆధునికరించనున్నట్లు ఆయన తెలిపారు. సిమెంట్ రోడ్డు శిథిలావస్థకు మారడంతో ప్రయాణికులు మరియు ప్రజలు రాకపోకలకు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు సూచనల మేర నిధులు మంజూరు కావడంతో రోడ్డును ఆధునికరించనున్నట్లు సాయిబాబా తెలిపారు. అదేవిధంగా రూ 75 లక్షలజలజీవన్ నిధులతో వాటర్ పైప్ లైన్ వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు అధికారులు రోడ్డును పరిశీలించి కొలతలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి ఈపూరి విజయబాబు, పంచాయతీరాజ్ ఏఈ రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి బాదావత్ మాంజీ నాయక్,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఎన్ శివకృష్ణ, టిడిపి నాయకులు డొక్కు శ్రీనివాసరావు, పప్పుల కిరణ్,కుంచె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కొరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

### -జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్:

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 4:
ఎన్ హెచ్ ఏ, ఆర్ అండ్ బి రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులపై సంబంధితశాఖల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు.బాపట్ల జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అభివృద్ధిలో బాపట్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మీ ముందున్న లక్ష్యాలను చేరుకునేలా అధికారులు మీ పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. అవిశ్రాంతంగా పనిచేస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలలో పురోగతిని సాధించగలమన్నారు. మీ ముందున్న లక్ష్యాలను వేగంగా చేరుకోగలిగితే బాపట్ల అన్ని రంగాలలో అభివృద్ధిలోకి వస్తుందన్నారు. "స్వర్ణ బాపట్ల పేరుతో వెబ్ సైట్ ను రూపకల్పన చేస్తున్నామని తెలిపారు." వివరాలను తర్వాత ప్రకటిస్తామన్నారు. రహదారుల నిర్మాణం, మరమ్మతులు పూర్తయితే ప్రజా రవాణా మెరుగుపడుతుందని కలెక్టర్ చెప్పారు. వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందన్నారు. తద్వారా ఆర్థిక వనరులు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని ఆర్ అండ్ బి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నూతన రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులు వేగంగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా తీర ప్రాంతాలను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న రహదారులు, మరమ్మతులు చేస్తున్న వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. గుంతల రహిత రహదారుల నిర్మాణం లక్ష్యంతో పనులు ముందుకు సాగాలన్నారు. సాస్కి పథకం కింద జీవో నెంబర్ 531తో జిల్లాకు మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. రూ.రెండు కోట్లతో బాపట్ల-పెదనందిపాడు రహదారిని, రూ.రెండు కోట్లతో బాపట్ల-చీరాల రహదారిని, రూ. 1.50కోట్లతో తెనాలి-చందోలు రహదారిని, రూ.5.30 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. రూ.4.33 కోట్లతో కర్లపాలెం-గణపవరం, గణపవరం-పెద్దపులుగువారిపాలెం రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.ఐదు కోట్లతో మాచవరం-అల్లూరు, రూ.ఒక కోటితో తెనాలి-చందోలు,



రూ.మూడు కోట్లతో చందోలు-నిజాంపట్నం, రూ.నాలుగు కోట్లతో బ్రాహ్మణకోడూరు-భట్టిప్రోలు, రూ.2.50 కోట్లతో కుడిపూడి-గోవాడ, రూ.మూడు కోట్లతో బాపట్ల-పర్చూరు, రూ.2.20 కోట్లతో బాపట్ల-పాండురంగాపురం, రూ.2.20 కోట్లతో కంకటపాలెం-మురుకొండపాడు రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అలాగే వాల్తేరు-జువ్వలపాలెం, రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి అధికారులు డీఈలు నళిని, అరుణకుమారి, రాజేష్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు

# అండర్ 14 క్రికెట్ స్టేట్ - బీ టీంలో మెహబూబ్ వలి:

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 4:
ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన అండర్ 14 క్రికెట్ స్టేట్ -బీ టీంలో బాపట్ల విద్యార్థి షేక్ మెహబూబ్ వలి కి స్థానం దక్కడం సంతోషదాయకమని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం మెహబూబ్ వలి ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆయా రంగాల్లో వారికి ఇష్టమైన క్రీడల్లో కూడా ప్రతిభను చాటాలని తెలిపారు. క్రీడలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. మెహబూబ్ అలీ అండర్ 14 స్టేట్ -బి టీంలో మంచి ప్రతిభను చాటాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కోచ్ అమీర్ మాట్లాడుతూ మెహబూబ్ వలి బాపట్ల పట్టణం జమిందార్ పేటలోని ఎంసీఏ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు అన్నారు. ఎంసీఏ అకాడమీలో శిక్షణ పొందుతూ రాష్ట్రస్థాయి క్రికెట్ టీం లో స్థానం దక్కించుకోవడం గర్వకారణం అన్నారు. త్వరలో అండర్ 14 క్రికెట్ స్టేట్ -బీ మ్యాచులు తమిళనాడులో జరుగుతాయని తెలిపారు. స్టేట్ బీ టీంలో మహబూబ్ బాపట్ల జిల్లా మరియు రాష్ట్రం పేరును గర్వించే విధంగా ప్రతిభను చాటాలని ఎంసీఏ క్రికెట్ అకాడమీ సెక్రెటరీ షేక్ కరీముల్లా తెలిపారు. బాపట్ల పట్టణంలో ఉన్న ఎంసీఏ క్రికెట్ అకాడమీ తరఫున ఇప్పటికే ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం గర్వకారణం అన్నారు.



# నేషనల్ స్పేస్ సొసైటీ ప్రాజెక్టులో బాపట్ల నారాయణ ఘనవిజయం

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 4:
నేషనల్ స్పేస్ సొసైటీ ప్రాజెక్టు నందు ప్రపంచవ్యాప్తంగా 35 దేశాలలో 7000 ప్రాజెక్టుల నందు ప్రపంచ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో రెండో స్థానంలో 9వ తరగతి విద్యార్థులు చరణ్ శివ సాయి, రిషికేశ్, శశిధర్, గౌతమ్ నందన్, కలిసి తయారు చేసిన ప్రాజెక్టు సెలెస్టియల్ హార్వెస్ట్ లో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఏటీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో ప్రాజెక్టులలో స్కూల్ విద్యార్థులు సైన్స్ లో సాధించిన విజయాన్ని అభినందించారు ఇలా నారాయణ విద్యాసంస్థల్లో బాపట్ల నారాయణ విద్యాసంస్థ ఇది రెండోసారి గమనించడం సాధించడం ముందంజలో ఉందని అన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యరాణి మాట్లాడుతూ... స్కూల్ విద్యార్థులు ఈ ప్రాజెక్టులో ఘనత సాధించడం గర్వకారణంగా ఉందని ఇటువంటి ప్రాజెక్టులు మరిన్ని చేసి స్కూల్ కి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం వెంకటేశ్వర్లు రామకృష్ణ శర్మ ప్రిన్సిపల్ భాగ్యరాణి కోఆర్డినేటర్ తిరుమలరావు అకాడమిక్ టీం రవీంద్రబాబు బయలుదేరి టీచర్ కీర్తి సంతోష్ ఎన్ఎస్ఎస్ ఇంచార్జ్ గోపి టెన్త్ ఇంచార్జి సాంబశివరావు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల విద్యార్థులు పాల్గొన్నారు




# కార్మిక హక్కుల కోసం సమ్మె... సమ్మె కోసం కార్మికుడు

### శ్రమకు న్యాయం కావాలి... సమ్మె జయప్రదం కావాలి

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 04: పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం చిత్రాలయ సెంటర్ వద్ద బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పిలుపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఉప్పలపాటి రంగయ్య మరియు సీపీఐ ఏరియా కార్యదర్శి కామ్రేడ్ సత్యనారాయణ రాజు మాట్లాడారు. ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెను కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. రైతు సంఘాలు, కార్మిక సంఘాలు సంయుక్తంగా చేపడుతున్న ఈ సమ్మె ప్రజా సమస్యల పరిష్కారం కోసం కీలకమని వారు అన్నారు. కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె ఒక పోరాటమని వారు తెలిపారు. కార్మికులు, రైతులు, ఉద్యోగులు ఈ సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్కే చిన్న జాను సైదా, సీపీఐ మండల కార్యదర్శి దొడ్డ అంజిరెడ్డి, రైతు సంఘం నాయకుడు నాగేశ్వరావు, ఏఐటీయూసీ నాయకులు సాంసంగ్ వెంకయ్య, కొవ్వూరు బాబు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.




# సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం

### విద్యార్థుల భద్రతే లక్ష్యం-సురక్షిత డిజిటల్ వాడకం అవసరం

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 04: నరసరావుపేటలోని కొత్త రఘురామయ్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం బుధవారం నాడు నిర్వహించారు. నరసరావుపేట ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు, రెండవ పట్టణ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో, మహిళా ఎస్సై యశ్న పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సోషల్ మీడియా వ్యసనాలపై అవగాహన కల్పిస్తూ, అనవసర యాప్‌ల వినియోగం చేయవద్దని సూచించారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాల్లోని లింకులను ఓపెన్ చేయవద్దని, ఆన్‌లైన్ మోసాల పట్ల ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అలాగే సైబర్ నేరాల వల్ల కలిగే ఆర్థిక, వ్యక్తిగత నష్టాలపై వివరించారు. వ్యక్తిగత సమాచారం, మొబైల్ వివరాలు, బ్యాంకు సంబంధిత సమాచారం భద్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు.ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# దాతలు ముందుకు రావడం అభినందనీయం : కలెక్టర్:

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 4:
జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బాపట్ల సేవా సేతు' కార్యక్రమానికి ప్రజలు, వివిధ సంఘాలు, ఉద్యోగుల నుంచి లభిస్తున్న స్పందన అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు .బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని న్యూ వీసీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ వైద్యులు, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు ,చీరాల,రెపల్లే ,బాపట్ల ఐఎంఏ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.'బాపట్ల సేవా సేతు' (ఝిజూఫ్రీఝ.జూ91.ఙీఏ) వెబ్‌సైట్‌లో ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన మౌలిక వసతుల వివరాలు పొందుపరిచినట్లు తెలిపారు. దాతలు వెబ్‌సైట్ ద్వారా అవసరాలను తెలుసుకొని నేరుగా ఆన్‌లైన్ ద్వారా సహాయం చేయవచ్చని, లేదా సంబంధిత అధికారులకు నేరుగా అందించవచ్చని చెప్పారు. అందిన వస్తువుల బిల్లులు, వివరాలు, ఉపయోగంలో ఉన్న స్థితి తదితర సమాచారం మొత్తం వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయడం జరుగుతుందని, దాతల సహకారం పూర్తిగా పారదర్శకంగా ప్రదర్శించబడుతుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా చీరాల ఐఎంఏ బ్రాంచ్ వారు ప్రింటర్‌ను డొనేట్ చేయగా, చీరాల ఐకాన్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ కొండల్ రావు సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, ఎన్టీఆర్ ఆరోగ్యసేవ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సమిష్టి కృషితో కోటప్పకొండ తిరునాళ్లను విజయవంతం చేద్దాం





## ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 04: కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం లో పాల్గొన్న మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, జిల్లా ఎస్పీ బీ కృష్ణారావు. ఫిబ్రవరి 15వ తేదీన జరగనున్న శ్రీ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల నిర్వహణపై బీసీ వెల్ఫేర్ శాసనసభ కమిటీ సభ్యులు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు బుధవారం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు ఆనం రామ నారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల,జిల్లా ఎస్పీ బి కృష్ణారావు, ఎమ్మెల్యే లు పత్తిపాటి పుల్లారావు, జి వి ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి, పాల్గొని ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తిరునాళ్లకు భారీగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కొండపైకి నడక ద్వారా క్యూ లైన్లలో వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా మజ్జిగ, మంచినీరు సమృద్ధిగా అందేలా చూడాలని అయన తెలిపారు. అలాగే వృద్ధులు, వికలాంగులు సులభంగా దర్శనం చేసుకునేలా ప్రత్యేక వాహనాలు మరియు అవసరమైన ఇతర సౌకర్యాలు కల్పించాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు.

అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు వెంటనే వైద్య సేవలు అందేలా ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని పల్నాడు జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. తిరునాళ్ల సమయంలో లో ఓల్టేజ్ లేదా విద్యుత్ అంతరాయాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు.

వేలాదిగా వచ్చే భక్తుల దృష్ట్యా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా శానిటేషన్ పనులను సమర్థవంతంగా నిర్వహించాలని, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సమిష్టి కృషితో కోటప్పకొండ తిరునాళ్లను విజయవంతం చేసి జిల్లా ప్రతిష్టను మరింత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. కోటప్పకొండ తిరుణాలకు రూ.30 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసిన మంత్రి ఆనం రాం నారాయణ రెడ్డి. గత సంవత్సరం వివిధ దేవాలయాలనుండి రూ.70 లక్షలు కోటప్పకొండకు అప్పుగా ఇప్పించామని ఆ నిధులలో రూ.12 లక్షల వరకు తిరిగి చెల్లించారని మిగతా 58 లక్షలు రుణమాఫీ చేయడం జరిగిందని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు. కోటప్పకొండ అభివృద్ధికి తన వంతు సహాయ సహకార ఎల్లప్పుడు అందిస్తానని అయన తెలిపారు.

# రహదారుల రూపకల్పనకు నిర్మాణాత్మకమైన కృషి;

## -బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు వెల్లడి:



పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 4:
బాపట్ల నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాలకు మహర్దశ కలిగింది. శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు సూచన మేరకు ప్రధాన రహదారులకు నిధులు కేటాయించారు. కర్లపాలెం మండలం పేరలి గ్రామం నుండి తుమ్మలపల్లి వయా పెర్లమ్మ ఆలయ వరకు రహదారి నిర్మాణానికి రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ వెల్లడించారు. కొన్ని దశాబ్దాలుగా ప్రజలు పడుతున్న ఆందోళన పై స్పందించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు చేసిన కృషి ఫలితంగా ఒక చక్కటి రహదారికి మార్గం సుగమం అయింది. బాపట్ల మండలం పూండ్ల రహదారి నుండి మర్రిపూడి మాలపల్లి వరకు 81 ఒక్క లక్షల రూపాయలతో రహదారి నిర్మించనున్నారు. నిధులను మంజూరు చేయటంలో సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కృతజ్ఞతలు తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో అనేక రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ గుర్తు చేశారు. తిరిగి మరో రెండు రోడ్లకు నిధులు మంజూరు అయ్యాయని వెల్లడించారు. నియోజకవర్గంలో దశాబ్దాల తరబడి అమలుకు నోచుకొని రహదారులకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకొని అందమైన రహదారులకు రూపకల్పన చేస్తామని చెప్పారు. మరికొన్ని రోడ్ల నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు చేసి ఉన్నామని వెల్లడించారు. త్వరలోనే ఆయా నిధులు మంజూరు అవుతాయని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ చెప్పారు. గుంతలు లేని రహదారులు నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లో అనేక రహదారుల పరిస్థితిపై నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో రహదారులను కలిపే అనుసంధాన రోడ్ల విషయంలో ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. బాపట్ల నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు వెల్లడించారు

# షిరిడి సాయి సత్య సాయి బాబా మందిరం 20వ వార్షికోత్సవ సందర్భంగా వ్యాసరచన పోటీలు

**- వ్యాసరచన పోటీలలో గెలుపొందిన సెయింట్ జోన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థి: హేమంత్ రెడ్డి**

**- విద్యార్థి హేమంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించిన కరస్పాండెంట్ మర్రి అనిల్ కుమార్**



పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల ఫిబ్రవరి 4:--
పల్నాడు జిల్ల కారంపూడి మండలంలో స్థానిక సెయింట్ జోన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ షిరిడి సాయిబాబా మందిరం 20వ వార్షికోత్సవ సందర్భంగా రాష్ట్రస్థాయి వ్యాసర పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ స్థానం 9వ తరగతి చెందిన హేమంత్ రెడ్డి విద్యార్థికి ప్రధమ బహుమతి సాధించాడు.సిస్టర్ బినోమ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ రెవరెండ్ మర్రి అనిల్ కుమార్ హేమంత్ రెడ్డి కి విద్యార్థికి ప్రత్యేకంగా అభినందనలు తెలియపరచారు.విజేత అయినట్టి విద్యార్థి హేమంత్ రెడ్డిని భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో విజయాలను సాధించాలని మరియు ఉత్తమ స్థానానికి వెళ్లాలని విద్యార్థిని అభినందించారు. ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

# తిరుమల పవిత్ర ప్రసాదంతో రాజకీయమా

**-పవిత్రతపై కల్తీ చేసిన పాలనకు జవాబు తప్పదు-ఆవులు లేని చోట నెయ్యి ఎక్కడి నుంచి వచ్చింది**

**-పాలు లేకుండా నెయ్యి సాధ్యమ -భక్తుల నమ్మకంతో చెలగాటమా-తిరుమల పవిత్రతకు ఎవరు బాధ్యులు**

**జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు నరసరావుపేట ఇంచార్జి సయ్యద్ జిలాని**







నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 04: తిరుమల లడ్డు ప్రసాదం విషయంలో గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై ప్రజల్లో తీవ్ర ఆవేదన నెలకొంది. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు నరసరావుపేట ఇంచార్జి సయ్యద్ జిలాని బుధవారం మీడియాతో మాట్లాడారు.

తిరుమల లడ్డు ప్రసాదం కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక. అలాంటి పవిత్రమైన ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యి విషయంలో గత ప్రభుత్వం ఘోర నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఆవులు లేని, డైరీ వ్యాపారం లేని సంస్థలకు నెయ్యి సరఫరా బాధ్యతలు అప్పగించడం ద్వారా భక్తుల భావోద్వేగాలతో చెలగాటమాడారని అయన అన్నారు. పాలు, పెరుగు, వెన్న అనే మౌలిక వనరులే లేకుండా 60 లక్షల కిలోల నెయ్యిని ఎలా సరఫరా చేయగలిగారన్న ప్రశ్నకు వైసీపీ ఇప్పటివరకు సమాధానం చెప్పలేదని జిలాని విమర్శించారు. వాస్తవంగా నెయ్యి పేరుతో జంతు కొవ్వులు, రసాయనాలు వినియోగించారన్న ఆధారాలు వెలుగులోకి వచ్చాయని అయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన పరిశీలనలతో ఈ దారుణాలు బయటపడ్డాయని అన్నారు. వైసీపీ పాలనలో కీలక బాధ్యతలు నిర్వహించిన నాయకులు ఇప్పుడు కల్తీ సహజమే అన్నట్లు వ్యాఖ్యలు చేయడం చూస్తే, వారికి ధర్మం, చట్టం, ప్రజల విశ్వాసం పట్ల ఎలాంటి గౌరవం లేదని స్పష్టమవుతోందని అన్నారు.

జాతీయ పాడి అభివృద్ధి మండలి ఇచ్చిన నివేదికలోనే తిరుమల లడ్డు ప్రసాదంలో జంతు కొవ్వులు కలిసినట్లు స్పష్టంగా పేర్కొనగా, ఆ తరువాత జరిగిన దర్యాప్తులో అసలు పాలే ఉపయోగించకుండా కేవలం రసాయనాలతో నెయ్యి తయారు చేసినట్లు తేలిందని వివరించారు.ఈ అంశంపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అధికారిక నివేదికల ఆధారంగా ప్రశ్నించడం పూర్తిగా న్యాయసమ్మతమని జిలాని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో తిరుమల పవిత్రతను తాకట్టు పెట్టి, దానిని అవినీతికి కేంద్రంగా మార్చిన నిజాలు ప్రజలు గమనించాలని అయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వీరవల్లి వంశీ, అచ్చుల సాంబశివరావు, ఎస్ కే అద్రూఫ్, బెల్లంకొండ ఈశ్వర్, చెన్నూపల్లి సాంబ, ఆర్ కే యాదవ్, అప్పిశెట్టి లక్ష్మీనారాయణ, చిందుకూరి శ్రీను, కృష్ణంశెట్టి ఏడుకొండలు, తెడ్ల వెంకటేశ్వర్లు, గురజాల వాసు, బాషా, మీనా దినేష్, ఖాజావలి, విజయ్, పండు, నాని మరియు వీరమహిళలు జడా శ్రావణి, అంబటి రేణుక తదితరులు పాల్గొన్నారు.

# కారంపూడి ఎంపీపీగా కనకదుర్గ - శ్రీనివాసరావు





పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల ఫిబ్రవరి 4:--
కారంపూడి మండల పరిషత్ అధ్యక్షుని ఎన్నిక స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. మండలంలోని 11 మంది ఎంపీటీసీ సభ్యులు పాల్గొనగా వేపకం పల్లి ఎంపిటిసి సభ్యులు కనకదుర్గ శ్రీనివాసరావు ఎంపీపీగా నామినేషన్ వేశారు. గాదెవారిపల్లి ఎంపీటీసీ సభ్యులు కూనిశెట్టి నాలుగవ సైదా రెడ్డి ప్రతిపాదించగా ఒప్పిచెర్ల రెండు ఎంపీటీసీ పిన్నెల్లి అనంతరామయ్య ఆమోదించటంతో ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఎన్నికల అధికారి ఇండస్ట్రీస్ ఏడి నవీన్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. పటిష్ట బందోబస్తు నడుమ ఎన్నిక కొనసాగింది గడువు ముగిసే సమయానికి ఎంపీటీసీ సభ్యులు నామినేషన్ వేయకపోవడంతో బొల్లెడి కనకదుర్గ శ్రీనివాసరావు కూటమి నేతలు నామినేషన్ దాఖలు చేయించారు. గత కొన్ని నెలలుగా ఎంపీపీ లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది ఎంపీపీ ఎన్నికకు ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

**కూటమి నేతలు అభినందనలు**

కారంపూడి మండల పరిషత్ అధ్యక్షునిగా వేపకం పల్లి ఎంపీటీసీ , బొల్లెడి కనకదుర్గ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నిక అవడంతో కూటమి నేతలు అభినందించారు. మండల పరిషత్ అభివృద్ధికి కృషిచేసి గ్రామాల అభివృద్ధి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి పంగులూరు పుల్లయ్య, అంజయ్య, మునుగోడు సత్యం, మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ళ సురేష్ యాదవ్,చప్పిడి రాము, లక్ష్మీనారాయణ, కటికల బాలకృష్ణ, మస్తాన్ జానీ, చావా వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, నాగారపు రామకృష్ణ,తోట అల్లయ్య, తదితరులు పాల్గొన్నారు

# వైసీపీ నేతల దౌర్జన్య వ్యాఖ్యలకు గట్టిగా హెచ్చరించిన చిలకలూరిపేట నియోజకవర్గ తెలుగుదేశం మహిళలు

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 04 :
చిలకలూరిపేట: నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఇటీవల చేస్తున్న అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ మహిళలు తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా అంబటి రాంబాబు ఘటనకు సంబంధించిన పరిణామాలు, అలాగే విడదల రజినీ మాజీ మంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును ఏకవచనంతో సంబోధించడం వారి సంస్కారహీనతకు నిదర్శనమని మహిళలు మండిపడ్డారు.

ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ --
"ముందుగా వైసీపీ నేతలు తమ అసమర్థ పాలనను, అవినీతి పాలనను గుర్తు చేసుకోవాలి. ప్రజలు ఎందుకు ఛీ కొట్టారో, ఎందుకు అధికారాన్ని త్రోసిపుచ్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. చిలకలూరిపేట ప్రజలు మిమ్మల్ని బహిరంగంగా తిరస్కరించి నియోజకవర్గం నుంచి బదిలీ చేశారన్న సంగతి మర్చిపోవద్దు" అని హెచ్చరించారు.

నియోజకవర్గం నుంచి ప్రజల ఆగ్రహంతో బయటకు పంపబడిన నాయకులు మళ్లీ ఇక్కడ పోటీ చేస్తే ప్రజలు ఎలా గుణపాఠం చెబుతారో వారికి బాగా తెలుసునని అన్నారు. ప్రజల చేతిలో ఓడిపోయిన వారు, ప్రజాభిమానం పొందిన మా నాయకుడు పుల్లారావు స్థాయిలో మాట్లాడే అర్హతే లేదని స్పష్టం చేశారు.

పుల్లారావు చిలకలూరిపేట అభివృద్ధికి అంకితభావంతో పని చేసి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని, అలాంటి నాయకుడిని తక్కువ చేసి మాట్లాడడం వైసీపీ నేతల నీచ రాజకీయానికి పరాకాష్ట అని మహిళలు ఆరోపించారు.

ఇకపై మా నాయకులపై, పార్టీపై అసభ్య పదజాలంతో దాడులు చేస్తే ఊరుకోబోమని, అవసరమైతే రోడ్డెక్కి పోరాడతామని, ప్రజల మద్దతుతో గట్టిగా సమాధానం ఇస్తామని తెలుగుదేశం పార్టీ మహిళలు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు మిరియాల రత్నకుమారి, జరీనా సుల్తానా, అమరా రమాదేవి, అద్దంకి అనిత బాయి, కూనల ప్రేమీలా, యాదాల సుజాత, పోపూరి లక్ష్మి, పాములపాటి శివకుమారి, కొత్త కుమారి, జంగా సుజాత, కంచర్ల కరుణ, రాయని హరిత, కనమర్లపుడి లక్ష్మి తిరుమల, అనంత వీరకుమారి, చెన్నంశెట్టి పద్మ, అరేకట్ల త్రివేణి, నల్లమోతు ఉదయలక్ష్మి, ఫాతిమా, తెప్పలి కాసులమ్మ, వనిత బాయి, సుభాషిణి, కనికరం, తులసమ్మ, అఖిల బాయి, బిబి జాన్, దుర్గ బాయి తదితరులు పాల్గొన్నారు.



# శివరాత్రి ఉత్సవాల్లో విద్యుత్ ప్రభలే ప్రధానాకర్షణ : ప్రత్తిపాటి

**-కోటప్ప కొండ క్షేత్ర అభివృద్ధి, శివరాత్రి ఉత్సవాలకు అవసరమైన నిధులు కేటాయించాలని మంత్రి ఆనంను కోరుతున్నా : ప్రత్తిపాటి.**

**-కోటప్పకొండ తిరునాళ్ల నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రులు ఆనం, గొట్టిపాటి, చీఫ్ విప్ జీవీతో కలిసి పాల్గొన్న మాజీమంత్రి.**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 04 :
చిలకలూరిపేట : కోటప్పకొండ తిరునాళ్లకు విద్యుత్ ప్రభలే ప్రధానాకర్షణ అని, అవి లేని శివరాత్రి ఉత్సవాలను ఊహించుకోవడమే కష్టంగా ఉంటుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం కోటప్పకొండ శివరాత్రి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై కొండపైన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పల్నాడు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ.ఆంజనేయులు, నరసరావుపేట, మాచర్ల ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డిల సమక్షంలో, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మాజీమంత్రి ప్రత్తిపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కోటప్పకొండ ఉత్సవాల ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఆలయ అభివృద్ధి, రోడ్ల నిర్మాణం.. విస్తరణపై మంత్రులు, అధికారులకు ప్రత్తిపాటి విస్పష్టంగా అభిప్రాయాలు తెలియచేశారు. కొండదిగువన విద్యుత్ ప్రభలు నిలిపేందుకు ఇబ్బంది లేకుండా చూడాలని, రియల్ ఎస్టేట్ వెంచర్ల పేరుతో పొలాలను చదునుచేసి వేసిన ప్లాట్లపై అధికారులు దృష్టి పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు. ప్లాట్లు ఉంటే.. విద్యుత్ ప్రభలు నిలపడానికి, వాటిని చూడటానికి భారీగా తరలివచ్చే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ప్లాట్లు వేసిన వారితో మాట్లాడి, ప్రభలకు ఇబ్బంది లేకుండా అధికారులు వాటి తొలగింపుపై దృష్టి పెట్టాలన్నారు. చీకట్లో పాతుడు రాళ్లు, కర్రలు తగిలి భక్తులు ప్రమాదానికి గురయ్యే అవకాశముందన్నారు.



**కోటప్పకొండ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించాల్సిందే.**

నరసరావుపేట శాసనసభ్యులు అరవిందబాబుకి, తనకు మంచి సన్నిహిత సంబంధాలున్నా యని మా మైత్రిని ఎవరూ తప్పుగా భావించాల్సిన పనిలేదని ప్రత్తిపాటి తెలిపారు. కోటప్పకొండ ప్రముఖ ఆధ్యాత్మిక శైవక్షేత్రమని, రాష్ట్రవ్యాప్తంగా పేరున్న గొప్ప దేవాలయమని, ఆలయ అభివృద్ధికి శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించాల్సిందేనని ప్రత్తిపాటి, మంత్రి ఆనంను కోరారు. కొండవీడు కోట పర్యాటక ప్రదేశమని, దానితో కోటప్పకొండకు పొంతన లేదన్నారు. కోటప్పకొండకు వచ్చే విద్యుత్ ప్రభల్లో 80శాతం చిలకలూరిపేట నియోజకవర్గం నుంచే వస్తాయని ప్రత్తిపాటి చెప్పారు. 7, 8 తేదీల్లో కొండవీడు ఉత్సవాలను ఘనంగా నిర్వహించున్నామని, అందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం ఇప్పటికే తలమునకలైందన్నారు.

**దొంగలపై నిఘా పెట్టండి..**

కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రెవెన్యూ, పోలీస్ తదితర విభాగాల యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ప్రత్తిపాటి సూచించారు. శివరాత్రి రోజున బయటి రాష్ట్రాల నుంచి దొంగలు ఎక్కువగా వస్తున్నారని, భక్తుల జేబులు కొట్టేసి, మహిళల బంగారు నగలు కాజేసి రాత్రికి రాత్రే ఉడాయిస్తున్నారని, వారిని గుర్తించడంలో పోలీస్ వారు ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రత్తిపాటి జిల్లా ఎస్పీ కృష్ణారావుకు సూచించారు.
ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు, గ్రంథాల చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, దర్శి నియోజకవర్గం ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మీ, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, జి.డి.సి.సి. బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లిఖార్జున రావు, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కోటప్పకొండ దేవస్థాన చైర్మన్, ఈవో, ఆర్డీవో మధులత , వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆంధ్రప్రదేశ్ పద్మశాలి మహాసభ..

???పెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 04.
రాష్ట్ర బీసీ మరియు చేనేత శాఖా మంత్రి ఎస్ సవిత ని క్యాంప్ ఆఫీస్ లో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం నేతలు కలిసి ఆమెను సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం నేతలు తలపెట్టిన పద్మశాలి మహాసభ కు ఆహ్వానిస్తూ ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ కూడా త్వరగా ఇప్పించమని,
ఏప్రిల్ నెలలో జరుగు పద్మశాలి మహాసభ ను మంగళగిరిలో సుమారు రెండు లక్షల మంది తో నిర్వహించాలని సంఘం తీర్మానించినట్లు,మంత్రికి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం నేతలు వివరించారు.కార్యక్రమంలోఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరర, . జంజనం వెంకట సాంబశివరావు, గుంటూరు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు. బుద్ధంటి రవికిరణ్ రాష్ట్ర పద్మశాలి సంఘం నాయకులు. కొల్లి బాబురావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు
.

# జక్కంపూడి రాజా ఇప్పుడు స్టార్ట్ అయింది, చాకిరేవు...రాచకొండ లక్ష్మయ్య..

???పెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 04.



మాజీ మంత్రి జక్కంపూడి రాజా మీకు దమ్ము ధైర్యం ఉంటే బీసీలను కాదు మాట్లాడే వారిని మాట్లాడు ఖబర్దార్ జాగ్రత్తగా ఉండు బీసీలలో ఏం చేయాలనుకుంటున్నావే అనుకుంటున్నావేమో రజకులు బట్టలు మురికిని ఎట్ల వదలగొడతారు అదేవిధంగా తెచ్చుకుంటున్నావు నువ్వు జాగ్రత్తగా ఉండు ఒక మహిళని రజక మహిళ ఎమ్మెల్యే పట్టుకొని నువ్వు మాట్లాడాల్సిన మాటలేనా ఖబర్దార్ జాగ్రత్తగా మాట్లాడు రజకులు అంటే చులకనగా చూస్తున్నావు వాళ్ళు ఏం చేయలేరు అనుకుంటున్నారేమో ఎదురు తిరిగితే ఎంత దూరమైన నడవడానికి సిద్ధంగా ఉన్నారు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు మా ఇంటి ఆడపడుచని మాట్లాడే దమ్ము నీకుందా? నోరు దగ్గర పెట్టుకొని మాట్లాడు జక్కంపూడి జుట్టు పట్టుకొని లాగుతానంటున్నావ్ నీకుదమ్ముంటే ఒకసారి టచ్ చేసి చూడు కురుక్షేత్రంలో కౌరవులకు ఏమైందో మీకు కూడా అదే మీకు కూడా అదే గతి పడుతుంది దీని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు గుంటూరు ఛాలెంజ్ చేస్తున్నాను జాగ్రత్తగా మాట్లాడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య హెచ్చరించారు

# ఘనంగా ముగిసిన గుంటూరు టి10 క్రికెట్ లీగ్ పోటీలు....

పెన్ పవర్,గుంటూరు ఫిబ్రవరి:04,రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్ర పవనిజం అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 3 రోజులుగ జేకేసీ గ్రౌండ్ లొ టి10 క్రికెట్ లీగ్ పోటీలు మంగళవారం ఘనంగా ముగిసాయి ,ఫైనల్ పోరు రసవత్తరంగా,ఉత్కంఠ భరితంగా సాగింది,ఛాంపియన్స్ గ నవాబ్ 11 జట్టు విజయం సాధించింది రన్నర్స్ గ గుంటూరు మిర్చి జట్టు గెలుపొందారు,విజేతలకు మాజీ ఎం ఎల్ సి రాయపాటి శ్రీనివాస్,మాజీ మంత్రి డొక్కా మాణిక్యరావు,డా,నిమ్మల శేషయ్య లు బహుమతులు అందజేశారు,ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు దాతల ద్వారా ప్రత్యక బహుమతులు అందించారు,ఈ సందర్భంగా డొక్కా మాట్లాడుతూ యువత క్రీడలపట్ల మక్కువ పెంచుకోవాలని కోరారు,నిత్యజీవనంలో వ్యాయామము తప్పనిసరి అన్నారు,రాయపాటి మాట్లాడుతూ క్రీడలతోనే సమాజంలో ప్రత్యక గుర్తింపు వస్తుందని,కావున ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలని కోరారు,డా,శేషయ్య మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకే క్రీడాపోటీలను నిర్వహించడం పవనిజం అసోసియోషన్ చేస్తున్న కృషిని అభినందించారు,క్రీడాకారులకు భోజనవసతి కల్పించడం విశేషం,మొత్తం 24 జట్లు ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేశారని,అలాగే పోటీలకు సహకరించిన దాతలను అధ్యక్షులు కొణిదె గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు,కార్యక్రమంలో దుర్గాప్రసాద్,కిషోర్,వినోద్,అంజి,భరత్ ,యశ్వంత్ తదితరులు పోటీలను పర్యవేక్షించారు




# అరాచకం.. విధ్వంసంతో రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలన్నదే జగన్ వ్యూహం : ప్రత్తిపాటి

**-దానిలో భాగంగానే జగన్ తన పార్టీ శ్రేణుల్ని రెచ్చగొట్టే మాటలు, చర్యల దిశగా ప్రోత్సహిస్తున్నారు.**

**-జగన్ ఎన్ని ఆటంకాలు సృష్టించినా.. ముఖ్యమంత్రి చంద్రబాబు తాను చేపట్టిన అభివృద్ధి యజ్ఞాన్ని ఆపరు.**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 04 :
చిలకలూరిపేట : అరాచకం, విధ్వంసంతో రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చి, అంతిమంగా అభివృద్ధికి దూరం చేయాలన్న వ్యూహంలో భాగంగానే జగన్ తన పార్టీ శ్రేణుల్ని రెచ్చగొట్టే చర్యలు, ప్రసంగాల దిశగా ప్రోత్సహిస్తున్నాడని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో రూ.50లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్టీసీ సిబ్బంది, ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.
అరాచకం.. విధ్వంసంతో రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలన్నదే జగన్ వ్యూహం..
ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలతో తలపెట్టిన రాష్ట్ర అభివృద్ధి యజ్ఞాన్ని అడ్డుకొని, రాష్ట్రంలో విధ్వంసం, అరాచకం సృష్టించాలన్నదే జగన్ వ్యూహమని, పెట్టుబడులు రాకుండా అడ్డుకోవాలన్న కుట్రలో భాగంగానే మాజీముఖ్యమంత్రి తన పార్టీ శ్రేణుల్ని విద్వేషపూరిత ప్రసంగాలు, మాటల దిశగా రెచ్చగొడుతున్నాడని మాజీమంత్రి వివరించారు.
సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న నాయకుడు, 4వసారి ముఖ్యమంత్రి ఉన్న చంద్రబాబును ఉద్దేశించి వాడకూడని భాష వాడేలా తన పార్టీ నాయకుల్ని రెచ్చగొట్టి, వారిద్వారా అశాంతి, అలజడులు రేపితే పెట్టుబడిదారులు రాష్ట్రం వైపు చూడరన్నదే జగన్ కుట్ర అని ప్రత్తిపాటి తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెంది, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటే కూటమిప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచిపేరు వస్తుందని, దాంతో ప్రజలు తనను నమ్మరని, తన దుర్మార్గ రాజకీయాలు సాగవన్న దురాలోచన, దురుద్దేశంతోనే జగన్ రాష్ట్ర విధ్వంసమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ప్రోత్సాహం... ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తన విశ్వసనీయత, విజన్ తో తాను అనుకున్న విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాడని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. జగన్ ఎన్ని ఆటంకాలు, అడ్డంకులు సృష్టించినా చంద్రబాబు లక్ష్యాన్ని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలన్న మంత్రి లోకేశ్ సంకల్పాన్ని నీరుగార్చలేడని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు.
ఆర్టీసీ డిపో ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఏప్రియల్ నాటికి పూర్తి కావాలి
పట్టణంలోని ప్రధాన బస్టాండ్ లోని సమస్యల్ని ఆర్టీసీ పూర్వ ఎండీ ద్వారకా తిరుమలరావు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే రూ. 50 లక్షల నిధులు మంజూరు చేయించారని ప్రత్తిపాటి చెప్పారు. కోరిన వెంటనే నిదులు మంజూరు చేసిన ద్వారకా తిరుమలరావు మంచితనాన్ని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది గుర్తించాలన్నారు. వర్షం వస్తే నీరు నిలిచి ఆర్టీసీ డిపో చెరువును తలపిస్తోందని, లోతట్టు ప్రాంతమైనందున వర్షపు, బురదనీటితో ప్రయాణికులు, ఆర్టీసి సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించడానికే నేడు సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.50లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులు కాకుండా, ఇంకా అదనంగా చేయాల్సినవి ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే కార్యరూపం దాల్చేలా చూస్తామని ప్రత్తిపాటి తెలిపారు. ఇప్పుడు ప్రారంభించిన పనులు ఏప్రియల్ నాటికి పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించినట్టు ఆయన చెప్పారు. మంచి



ప్రభుత్వముంటేనే ఆర్టీసీ సంస్థకు, ఉద్యోగులకు మంచి భవిష్యత్ ఉంటుందని, స్థానిక ఆర్టీసీ డిపో ఆదాయం పెంపుపై అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఖాళీగా ఉన్న స్థలాలపై ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ఆర్టీసీ యూనియన్లు ఎన్ని ఉన్నా.. సంస్థ బలోపతం.. మనుగడే అందరి ప్రధాన లక్ష్యం కావాలన్నారు. రాజకీయాలతో పనిలేకుండా సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రత సంతోషమే లక్ష్యంగా అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని ప్రత్తిపాటి సూచించారు.
కార్యక్రమంలో జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఆర్టీసీ ఈడి నాగేంద్ర ప్రసాద్, ఆర్ఎం అజిత్ కుమారి, ఆర్టీసీ డీఎం యద్దనపూడి వేణు, బీజేపీ నాయకులు పోట్రూ పూర్ణ చంద్రరావు, ఆర్టీసీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, వరప్రసాద్, పావులూరి వెంకటేశ్వరరావు , కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ట్రేడ్ లైసెన్స్ ఫీజుల నూరు శాతం వసూళ్లు కావాలి.

**-..కమిషనర్ కె.మయూర్ అశోక్...**

???పెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 04,
గుంటూరు నగరాన్ని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జివిబి) ఫ్రీ నగరంగా తీర్చిదిద్దుకోవాలని, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల నూరు శాతం వసూళ్లు కావాలని, ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు పనితీరు మెరుగుపరుచుకోకుంటే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత వార్డ్ ల వారీగా మైక్రో ప్యాకెట్స్, కార్మికుల హాజరు, రోజువారీ సేకరించాల్సిన చెత్త, ఏటుకూరు పాయింట్ కి డివిజన్ల వారీగా వచ్చిన చెత్త, జివిబిలు తదితర వివరాలు ఇన్స్పెక్టర్లను అడిగి మాట్లాడుతూ, రానున్న 2 వారాల్లో జివిబిలు లేని నగరంగా ఉండాలని, అందుకు ఎస్ఎస్ లు మరింతగా పర్యవేక్షణ చేయాలన్నారు. నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం, కమర్షియల్ చెత్త సేకరణ ఏజన్సీలు సక్రమంగా ఉంటే జివిబిలు ఉండవన్నారు. అప్పటికీ చెత్త రోడ్ల మీద, డ్రైన్లలో వేసే వారిపై అపరాధ రుసుం విధించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గుంటూరు నగరంలో అవసరమైనదానికి మించి కార్మికులు విధుల్లో ఉంటున్నారని, అదనంగా కూడా కార్మికులను రోజువారీ వేతనంపై తీసుకుంటున్నా, ప్రణాళికాబద్ధమైన కృషి లేకపోవడం వలనే పారిశుద్యంపై ప్రజల్లో అసంతృప్తి ఉంటుందన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కార్మికులు హాజరు గూగుల్ స్ప్రెడ్ షీట్ లో అప్ లోడ్ చేయాలన్నారు. ఎన్జీటీ, ఎస్డబ్ల్యుఎం గైడ్ లెన్స్ మేరకు ప్రతి ఇంటి నుండి తడిపొడిగానే చెత్త సేకరణ జరగాలన్నారు. కార్మికులు ఎక్కడ ఎంత మంది క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉంటుంది, ఎవరు ఎక్కడ పని చేస్తుంది, వారి హాజరు తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన ఉందని, ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు నిర్దేశిత సమయం విధుల్లో ఉండాలన్నారు.మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ చేయకపోవడం వలన డ్రైన్లలో మురుగు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక నుండి మధ్యాహ్నం సమయంలో ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు.ట్రేడ్ లైసెన్స్ ల పై కూడా దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరూ పని తీరు మార్చుకొని, స్వచ్ఛ లీగ్ సిటి స్థాయిలో ఉన్న గుంటూరు నగరాన్ని అదే స్థాయిలో ఉండేలా కృషి చేయాలన్నారు.సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, విఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, డిఎస్ఓ ప్రసాద్, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



# మళ్లీ...బూతులతో రాజకీయాలు

**గుంటూరు, ఫిబ్రవరి 4, పెన్ పవర్** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎన్నికల విజయం తర్వాత అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాల్సిన సమయంలో.. వీధుల వెంట జరుగుతున్న దాడులు, ప్రతిదాడులు రాష్ట్ర భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి. ముఖ్యంగా మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్‌ల చుట్టూ తిరుగుతున్న తాజా పరిణామాలు ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తున్నాయి.నిన్న అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాల్సింది పోయి, బూతులతో కూడిన విమర్శలు చేయడం ఖచ్చితంగా గర్హనీయం. దీనిపై టీడీపీ శ్రేణులు భగ్గుమనడం సహజమే అయినప్పటికీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఆయన ఇంటిపై దాడి చేయడం సమర్థనీయం కాదు. పోలీసులు రంగప్రవేశం చేసి అంబటిని అరెస్ట్ చేయడంతో ఆ వివాదం ముగిసిందనుకున్న తరుణంలో, నేడు మరో కొత్త మంట రాజుకుంది.మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ చేసిన విమర్శలను సాకుగా చూపి టీడీపీ శ్రేణులు ఆయన ఇంటికి నిప్పు పెట్టడం అత్యంత దారుణమైన విషయం. అంబటి చేసిన వ్యక్తిగత దూషణలతో పోలిస్తే, జోగి రమేశ్ చేసినవి రాజకీయ విమర్శలుగానే పరిగణించవచ్చు. కానీ, చిన్న విమర్శను కూడా సహించలేక ఇళ్లకు నిప్పు పెట్టే స్థాయికి రాజకీయాలు దిగజారడం ఆందోళనకరం. "వైసీపీ హయాంలో జరిగిన అరాచకాలపై విసుగు చెందే ప్రజలు టీడీపీకి పట్టం కట్టారు. మళ్ళీ అదే పద్ధతులను టీడీపీ కేడర్ అనుసరిస్తే.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏముంటుంది?" అనే ప్రశ్న ఇప్పుడు సామాన్య ప్రజల నుంచి వినిపిస్తోంది.ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవజ్ఞుడు, సంయమనం పాటించే వ్యక్తి. ఆయన ఎప్పుడూ అభివృద్ధి, వ్యవస్థల ప్రక్షాళన గురించి మాట్లాడుతుంటారు. అయితే, పార్టీ కేడర్ మాత్రం నాయకుడి మౌనాన్ని 'చేతగానితనం'గా భావిస్తున్నట్టు కనిపిస్తోంది. "మాపై దాడులు జరిగినప్పుడు మేం భరించాం, ఇప్పుడు మా టైమ్ వచ్చింది" అనే పగతో రగిలిపోతున్న కేడర్, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పితే, పెట్టుబడులు రావు సరి కదా.. ఉన్న కంపెనీలు కూడా తరలిపోయే ప్రమాదం ఉంది. కేడర్ చేసే ఇటువంటి పనులు చివరకు ప్రభుత్వంపైనే మచ్చ తెస్తాయి.ఇది కేవలం ఒక పార్టీ కార్యకర్తల ఉద్రేకం మాత్రమే కాదు, రాష్ట్ర ప్రతిష్టకు

సంబంధించిన అంశం. ఈ విషయంలో చంద్రబాబు, లోకేశ్ తక్షణమే జోక్యం చేసుకోవాలి. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, అరాచకాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని కఠిన సందేశం పంపాలి. గత ప్రభుత్వ అవినీతిపై లేదా దాడులపై విచారణ జరిపి, చట్టబద్ధంగా శిక్షించాలే తప్ప వీధి పోరాటాలు పరిష్కారం కావు. ప్రతిపక్షాలు కూడా నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలి. బూతు పురాణాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం వల్ల నష్టపోయేది వారే అని గ్రహించాలి.ప్రజలు మార్పును కోరుకుని ఓటేశారు. ఆ మార్పు అభివృద్ధిలో, పరిపాలనలో కనిపించాలే తప్ప దాడులలో కాదు. రాష్ట్రం వల్లకాడు కాకుండా ఉండాలంటే, ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని అరాచక శక్తులపై మోపాలి. అది ప్రతిపక్షమైనా, స్వపక్షమైనా సరే! శాంతియుత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాల్సిన బాధ్యత ఇప్పుడు పాలకుల భుజస్కంధాలపై ఉంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మరో వివాదంలోమంచు ఫ్యామిలీ

**తిరుపతి, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** మంచు మోహన్ బాబు, మంచు విష్ణు మరోసారి వార్తల్లోకి ఎక్కారు. తిరుపతి లో మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ ఎఫ్ ఐ సంఘం వాళ్ళను కిడ్నాప్ చేయించారని మోహన్ బాబు, మంచు విష్ణు, సతీష్ లపై తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. రీసెంట్ గానే రేణిగుంట విమానాశ్రయం లో పోలీసులు సతీష్ ని అదుపులోకి తీసుకున్నారు. మరి ఇప్పుడు మోహన్ బాబు, మంచు విష్ణులను కూడా అదుపులోకి తీసుకుంటారో లేదో చూడాలి. పూర్తి వివరాల్లోకి వెళ్తే మోహన్ బాబు యూనివర్సిటీ లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చాలా కాలం నుండి ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. మోహన్ బాబు చిన్న తనయుడు మంచు మనోజ్ కూడా ఈ విషయం పై పెద్ద పోరాటమే చేసాడు. కొట్లాట వరకు వెళ్లి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది.అయితే రీసెంట్ విద్యార్థి సంఘాలు కూడా మోహబ్ బాబు యూనివర్సిటీ ఎదుట ధర్నాలు చేయడం మొదలు పెట్టాయి. విద్యార్థుల నుండి అన్యాయంగా అధిక ఫీజులు వసూలు చేసారని, తక్షణమే వాళ్లకు ఆ ఫీజులను తిరిగి చెల్లించాలని నేతలు డిమాండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన మోహన్ బాబు తన బౌన్సర్ల చేత వాళ్ళను కిడ్నాప్ చేయించినట్టు తెలుస్తోంది. కారులో వచ్చిన మోహన్ బాబు బౌన్సర్లు సినీ ఫక్కీలో విద్యార్థుల సంఘాల నేతలను ఎక్కించుకొని, మోహన్ బాబు ఫామ్ హౌస్ లో బంధించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే మోహన్ బాబు ఫామ్ హౌస్ కి వెళ్లి విద్యార్థుల సంఘం నేతలను విడిపించి బౌన్సర్లను అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. అయినప్పటికీ ఈ వ్యవహారం పై మోహన్ బాబు ఎలాంటి రెస్పాన్స్ కూడా ఇవ్వలేదు.విద్యార్థుల నుండి అక్రమంగా వసూలు చేసిన అదనపు ఫీజులను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మోహన్ బాబు పట్టించుకోకపోవడం తో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.ఈ నేపథ్యం లో వాళ్ళ బాధను అర్థం చేసుకున్న ఎస్ఎఫ్ఐ సంఘం, మరియు ఇతర విద్యార్థుల సంఘాలు యూనివర్సిటీ వద్ద ధర్నా చేపట్టి విద్యార్థుల బాధని మోహన్ బాబు కి అర్థం చేసే ప్రయత్నం చేశారు. అలాంటి వాళ్లకు సర్దిచెప్పి పంపాల్సింది పోయి, అహంకారంతో ఇలా కిడ్నాప్ చేయడం అమానుషం అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## ఆ మూడు సీట్లు దక్కేదెలా

**విజయవాడ, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ ఒక లోటు ఉంది. రాష్ట్రమంతటా గెలిచామని ఆ పార్టీ భావిస్తోంది. కానీ ఓ మూడు చోట్ల మాత్రం ఆ పార్టీకి ఇప్పటివరకు విజయం దక్కలేదు. జగన్ ప్రభంజనంలో సైతం ఆ మూడు చోట్ల టిడిపి విజయం సాధించింది. విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాల ప్రయోగాలు చేసింది. కానీ ఆ ప్రయోగాలు ఏవి ఫలించలేదు. ఎప్పటికప్పుడు అభ్యర్థులను మార్చింది. ఆ మార్పు ఎంతవరకు కూడా లాభం చేకూర్చలేదు. పైగా ఎంపీలుగా పోటీ చేసిన వైసీపీ నేతలకు అడ్రస్ లేకుండా పోయింది. రాజకీయ జీవితం లేకుండా పోయింది. ముఖ్యంగా విజయవాడ నుంచి పోటీ చేసిన ముగ్గురు నేతలు వైసీపీలో లేకుండా పోయారు. అందుకే ఇప్పుడు బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని చూస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎవరూ చిక్కడం లేదు. విజయవాడలో పోటీ అంటేనే నేతలు భయపడిపోతున్నారు.2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ బలమైన అభ్యర్థి అవుతారని భావించి.. పారిశ్రామికవేత్త కోనేరు ప్రసాద్ ను రంగంలోకి దించింది. అంతకు ముందు రెండు ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఎక్కువగా ఉంటుందని భావించింది. కానీ వైసీపీ లెక్కలు తప్పాయి. టిడిపి అభ్యర్థి కేసినేని నాని ఘనవిజయం సాధించారు. అయితే ఆ ఎన్నికల తరువాత కోనేరు ప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు.2019 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అయితే అప్పట్లో కూడా విజయవాడ పార్లమెంటు స్థానం దక్కించుకోలేకపోయింది. రెండోసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన కేసినేని నాని ఇక్కడ ఘనవిజయం సాధించారు. ఆర్థిక బలం ఉన్న పొట్లూరు వరప్రసాద్ ను రంగంలోకి దించింది. ఆయన ప్రముఖ నిర్మాతగా కొనసాగుతుండగా పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు జగన్. అయితే రాష్ట్రమంతటా ప్రభంజనం వీచింది కానీ .. విజయవాడలో మాత్రం టిడిపి అభ్యర్థి కేసినేని నాని గెలిచి పట్టు నిలుపుకున్నారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పొట్లూరు వరప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. క్రమేపి రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు.2024 ఎన్నికల్లో అనూహ్యంగా రెండుసార్లు ఎంపీగా పోటీ చేసి గెలిచిన కేశినేని నాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అంతకుముందు రెండుసార్లు గెలిచేసరికి అదంతా తన చరిష్మ అన్నట్టు భావించారు. అయితే ఆయన పై టిడిపి అభ్యర్థిగా తమ్ముడు కేసినేని చిన్ని పోటీ చేసి గెలిచారు. దీంతో క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెబుతున్నట్లు కేశినేని నాని ప్రకటించారు. అయితే విజయవాడలో పోటీ చేస్తున్న వారంతా ఇలా రాజకీయాలకు గుడ్ బై చెప్పడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్ గా మారింది. అక్కడ పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

## కాపు సామాజికవర్గం కోసం...

**ఏలూరు, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** 2024 ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పరాజయం పాలైందనే ప్రశ్నకు ఆ పార్టీ నేతలు, అనుచరులు వివిధ కారణాలు చెబుతున్నారు. కొందరు ఈవీఎంలు కారణమంటూ వ్యాఖ్యానించగా, మరికొందరు కూటమి పార్టీల ఐక్యత వల్ల ఓటమి వచ్చిందని అంటున్నారు. ఇంకొందరు సరైన ప్రచారం చేయలేకపోయామని స్వయంగా ఒప్పుకుంటున్నారు. బలమైన మీడియా ప్రభావం, చంద్రబాబు రాజకీయ వ్యూహాలే కారణమని విమర్శించే వర్గం కూడా ఉంది. ఇవన్నీ కొంతవరకు నిజమే కావచ్చు. కానీ అంతకంటే లోతైన సామాజిక, రాజకీయ అంశాలు కూడా ఈ ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం ఎప్పటినుంచో కీలకం. ముఖ్యంగా గోదావరి జిల్లాలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించే స్థాయిలో ఉంటాయి. 2024 ఎన్నికల్లో అదే జరిగింది. ఈ ప్రాంతంలో బలమైన కాపు సామాజిక వర్గం ఈసారి వైసీపీకి వ్యతిరేకంగా నిలిచింది. వారు పెద్ద ఎత్తున జనసేన వైపు మొగ్గు చూపారు. దీనికి ప్రధానంగా పవన్ కళ్యాణ్ ఆకర్షణ ఒక కారణంగా చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు అవసరానికి మించి పవన్‌పై విమర్శలు చేయడం వల్ల న్యూట్రల్ ఓటర్లు కూడా దూరమయ్యారని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. దాని ఫలితంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే లేదా ఎంపీ సీటు కూడా దక్కలేదు.చరిత్రను చూస్తే కాంగ్రెస్ టీడీపీ ( పోటీ ఉన్న రోజుల నుంచే గోదావరి ప్రాంతాల్లో టీడీపీకి బలమైన పట్టు ఉంది. అప్పట్లో కొంతవరకు కాంగ్రెస్‌కు కూడా ఆధారం ఉండేది. ఇప్పుడు జనసేన కలిసి రావడంతో ఈ రెండు పార్టీల కలయిక మరింత బలపడింది. యాభై శాతానికి మించిన ఓటు బ్యాంకుతో ఈ జిల్లాలు కూటమికి కంచుకోటలుగా మారాయని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 20 నెలలు గడిచినా, అక్కడ వైసీపీ గ్రాఫ్ ఆశించిన స్థాయిలో పెరగలేదన్న మాట వినిపిస్తోంది.ఎన్నికల అనంతరం కాపు వర్గానికి చెందిన పలువురు కీలక నేతలు వైసీపీని వీడడం కూడా పార్టీకి దెబ్బగా మారింది. మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని టీడీపీలో చేరారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుజనసేనలో చేరారు. ఇలాంటి పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి పెరిగిందని అంటున్నారు.ఇటీవల రామచంద్రాపురం కు చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ( పార్టీ మారతారన్న ప్రచారం ఊపందుకుంది. తన కుమారుడికి భవిష్యత్తులో టికెట్‌పై స్పష్టత లేకపోవడం, అలాగే వైసీపీలో గెలుపు అవకాశాలపై సందేహాలు కారణాలుగా చెబుతున్నారు. ఇదే సమయంలో వంగా గీత (, ముద్రగడ కుటుంబం వంటి నేతల విషయంలో కూడా పుకార్లు వినిపిస్తున్నాయి.

# ఇక బెంగళూరు ఆరుగంటలే



**కర్నూలు, ఫిబ్రవరి 4, పెన్ పవర్:**
ఏపీలో నేషనల్ హైవే ప్రాజెక్టుల పనులు వేగవంతం అయ్యాయి. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగి ఇటీవల ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు కనెక్టివిటీకి సంబంధించి ప్రాజెక్టులపై ఆరా తీశారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లాలో 167కే హైవే పనులు వేగవంతం చేశారు. ఈ నేషనల్ హైవే అందుబాటులోకి వస్తే బెంగళూరు తర్వగా వెళ్లొచ్చు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించిన పనుల్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ క్రమంలో బెంగళూరుకు కనెక్ట్ చేసే కీలకమైన నేషనల్ హైవే (167కే) పనులు స్పీడ్ అందుకున్నాయి. ప్రస్తుతం నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా నొస్సం వరకు 62 కిలో మీటర్ల హైవే పనులు చేపట్టారు.. అక్కడి నుంచి జమ్మలమడుగు కడప రోడ్డుకు కనెక్ట్ చేయనున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే.. 60 నుంచి 65 కిలో మీటర్ల దూరం తగ్గుతుందని.. బెంగళూరుకు 6 గంటల్లోపు వెళ్లొచ్చంటున్నారు.ఈ జాతీయ రహదారి 167కే నిర్మాణం కోసం 691.81 కోట్లు విడుదల చేశారు.. మొత్తం 486 ఎకరాల భూమిని సేకరించారు. నంద్యాల జిల్లాలోని ఆరు మండలాల్లోని (కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, నంద్యాల, సంజామల, గోస్పాడు) 22 గ్రామాల మీదుగా వెళుతోంది. మూడుచోట్ల బ్రిడ్జిలు.. అలాగే 158 చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఈ హైవేలో నాలుగు ప్రాంతాల్లో బైపాస్‌లు (కోవెలకుంట్ల, రైతునగరం, నొస్సం, గోస్పాడు) కూడా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి ఈ బైపాస్‌లు, కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. బైపాస్‌లు అందుబాటులోకి వస్తే నంద్యాల నుంచి నొస్సం గంటలోపే వెళ్లొచ్చు.ఈ హైవే పూర్తిచేస్తే కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలకు బెంగళూరుతో కనెక్టివిటీ పెరుగుతుంది. ఎందుకంటే రెండు జిల్లాల నుంచి బెంగళూరుకు వెళ్లేవారిలో.. ఐటీ ఉద్యోగులు, ఉపాధి కోసం వెళ్లేవారు, వ్యాపారులు ఉంటారు. వారందరికి ప్రయాణ సమయం తగ్గుతుంది. గతంలో బెంగళూరు వెళ్లాలంటే అవుకు, కొలిమిగుండ్ల మీదుగా తాడిపత్రి, అనంతపురం మీదుగా వెళ్లేవారు.

అదే 167కే జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే.. జమ్మలమడుగు, ముద్దనూరు మీదుగా తాడిపత్రి హైవేలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా బెంగళూరుకు త్వరగా వెళతారు. అలాగే ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిది కూడా కర్నూలు జిల్లా కావడంతో ఆయన కూడా ఈ హైవే పనుల్ని వేగవంతం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. మొత్తం మీద బెంగళూరు వెళ్లేవారికి కీలకమైన హైవే పనులు ఊపందుకున్నాయి.

# వైసీపీకి వరుస షాకులు



**నెల్లూరు, ఫిబ్రవరి 4, పెన్ పవర్:**
ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. తాజాగా మరో ఇద్దరు నేతలపై కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు అందించారు. సీఎం చంద్రబాబు, సోమిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాకాణిపై కేసులు నమోదు కాగా.. పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు.ఏపీ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు అధికార, విపక్ష పార్టీల మధ్య నిప్పు రాజేసింది. దీంతో మాటల తూటాలు, ఇళ్లపై దాడులు, కేసులు.. ఇలా ఏపీ రాజకీయం మొత్తం వేడెక్కిపోయింది. ఈ క్రమంలోనే విపక్ష వైసీపీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ మీద కేసులు నమోదు కాగా.. తాజాగా మరికొందరు మాజీ మంత్రులు కూడా కేసులు, నోటీసులతో ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి.తాజాగా మాజీ మంత్రి విడదల రజినీపై కేసు నమోదైంది. జనవరి 30వ తేదీన విడదల రజిని అనుచరులు, టీడీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు విడదల రజినీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీసులు విడదల రజినితో పాటుగా 21 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసు నమోదు చేశారు.మరోవైపు వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లిన పోలీసులు.. ఆయనకు నోటీసులు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఆధారంగా.. కాకాణిపై కేసులు నమోదయ్యాయి. నెల్లూరు గ్రామీణం, మనుబోలు, పొదలకూరులో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే విచారణకు రావాలంటూ కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు.అటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడుపైనా కేసు నమోదైంది. వినుకొండ పోలీసులు బొల్లా బ్రహ్మనాయుడు మీద కేసు నమోదు చేశారు. జనవరి 31వ తేదీ వినుకొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బొల్లా బ్రహ్మనాయుడు, ఇతర వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోపులాట జరగ్గా.. ఓ కానిస్టేబుల్‌ను వైసీపీ నేతలు తోసేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడినట్లు చెప్తున్నారు. ఈ కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగానే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటుగా 27 మంది వైసీపీ నేతలపై వినుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్లాన్ వర్కౌటవుతుందా

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రావడం లేదు. తమ పార్టీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే గతంలో జగన్ ఇలాంటి దాడుల విషయంలో వ్యవహరించిన తీరును ఇప్పటికీ ప్రజలు గుర్తు చేస్తున్నారు. వారికి గుర్తు లేకపోతే సోషల్ మీడియా గుర్తు చేస్తోంది. బీపీలు వస్తే పార్టీ కార్యకర్తలు, అభిమానులు దాడి చేస్తారు అన్న జగన్ మాటను ఎక్కువ మంది గుర్తు చేస్తున్నారు. అప్పట్లో టిడిపి నేత ఒక్కరూ బోస్ డీకే అనే పదాన్ని వాడారు. దానిని విచిత్రమైన బూతుగా మార్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. చివరకు జగన్మోహన్ రెడ్డి అదే మాటను వక్రీకరిస్తూ.. తనను అంత మాట అంటే అభిమానులకు బీపీ వచ్చి ఆ టిడిపి నేత ఇంటిపై పడ్డారని.. అందులో ఎంత మాత్రం తప్పు లేదని తేల్చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియా సమక్షంలో, పోలీసుల సమక్షంలో చంద్రబాబుపై బూతు పదం ప్రయోగించారు. ఇప్పుడు కూడా బీపీ వచ్చింది అని చంద్రబాబు ప్రకటించలేదు. ఎంతవరకు ఆయన సంమయమనం పాటించమని పార్టీ శ్రేణులను కోరేరే తప్ప ఇలా సమర్థించలేదు. అయితే తాజా పరిణామాలతో జగన్ వైఖరిని మరోసారి ప్రజల ముందు ఉంచుతోంది సోషల్ మీడియా. అయితే ఈ ఘటనతో పొలిటికల్ సెంటిమెంటు రగిలించాలని వైసీపీ భావించింది. కానీ దానికి ఎంత మాత్రం ప్రజలు అవకాశం ఇవ్వడం లేదు.మొన్నటికి మొన్న కల్తీ మద్యం వ్యవహారం జరిగింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా వైసీపీ నేతలే ప్లాన్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా మాజీ మంత్రి జోగి రమేష్ పేరు బయటకు వచ్చింది. ఈ కుట్రలో ఆయన భాగస్వామ్యం అయ్యారని నిర్ధారణ కావడంతో కోర్టు రిమాండ్ విధించింది. ఆ కేసు విచారణ అలా కొనసాగుతుండగానే ఆయన బెయిల్ పై బయటకు వచ్చారు. ఇప్పుడు అదే నేత నిత్యం లోకేష్ పై విరుచుకు పడుతూనే ఉన్నారు. అంబటి రాంబాబు కంటే దారుణంగా వ్యాఖ్యానాలు చేశారు. అయితే జోగి రమేష్ ఇంటి పై దాడి జరిగింది. కానీ ప్రజల నుంచి మాత్రం సానుభూతి లభించడం లేదు. అంబటి రాంబాబు ఇంటిపై

దాడి విషయంలో కూడా ప్రజలు లైట్ తీసుకుంటున్నారు. ఎందుకంటే ఆ ఇద్దరు నేతలు అత్యంత వివాదాస్పదులే. ఈ ఘటనల ద్వారా వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అంటే అంతకంటే మూర్ఖత్వం ఉండదు. వారి వల్ల మరింత చెడ్డ పేరు వస్తుందే కానీ.. ప్రజలు మాత్రం గుర్తించే ఛాన్స్ లేదు. దానిని జగన్ గుర్తించడం లేదు.ఏదైనా ప్రజా సమస్యలపై పోరాటం చేయవచ్చు కదా. సీనియర్ నేతలను ముందు పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించవచ్చు కదా? అయితే దానిని వదిలేసి ఇలా అంబటి రాంబాబు, జోగి రమేష్ లాంటి వారితో రాజకీయాలు చేయాలనుకోవడం మూర్ఖత్వమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు ఇటువంటి వారితో రాజకీయం చేస్తామంటే హర్షించరంటున్నారు. ఎందుకంటే రాజకీయాల్లో వీరు వ్యవహరించిన తీరు తెలిసినదే. అధికారంలో ఉన్నప్పుడు వీరు ఎంతలా తెగించి, దూకుడుగా వ్యవహరించారో తెలియనిది కాదు. అటువంటివారితో రాజకీయాలు చేయడం ఎంత మాత్రం సహేతుకం కాదని పార్టీలో సీనియర్ నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి వారిద్దరిపై ఆధారపడి, ఆ రెండు ఘటనలపై పోరాటం ప్రారంభించడం అనేది నిజంగా సాహసమే.

# ఒక్క పటిష్ట జట్టు కూడా లేదు: వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాకు ఇంత ఈజీ డ్రానా



**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ కప్ లాంటి మెగా ఈవెంట్ అనగానే ఆస్ట్రేలియాకు ఎక్కడ లేని పూనకం వస్తుంది. ద్వైపాక్షిక సిరీస్ లు ఎలా ఆడినా వరల్డ్ లో తమలోని మరో కోణాన్ని చూపిస్తారు. ఐసీసీ ట్రోఫీలంటే ఈజీగా గెలిచే ఆస్ట్రేలియా మరో ట్రోఫీపై కన్నేసింది. ఐసీసీ 2026 టీ20 వరల్డ్ కప్ కు రంగం సిద్ధమైంది. మరో మూడు రోజుల్లో ఈ టోర్నీ గ్రాండ్ గా ప్రారంభం కానుంది. భారత్, శ్రీలంకలు సంయుక్తంగా ఆతిధ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నీలో ఆతిధ్య జట్టు ఇండియాతో పాటు ఆస్ట్రేలియా కూడా టైటిల్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. షెడ్యూల్ ప్రకారం ఆస్ట్రేలియా తమ గ్రూప్ మ్యాచ్‌లన్నింటినీ శ్రీలంకలో ఆడాల్సి ఉంది. దీంతో ఇప్పటికే ఆసీస్ జట్టు కొలంబోకు చేరుకుంది. ఫిబ్రవరి 11న ఐర్లాండ్‌తో వరల్డ్ కప్ పోరును ఆస్ట్రేలియా స్టార్ట్ చేయనుంది. ఫిబ్రవరి 13న జింబాబ్వే, ఫిబ్రవరి 16న శ్రీలంక, ఫిబ్రవరి 20న ఒమన్‌తో తలపడనుంది. ఇక్కడ ఒక విషయం గమనిస్తే ఆస్ట్రేలియా ఉన్న గ్రూప్-బి లో అన్ని చిన్న జట్లే ఉన్నాయి. ప్రతి గ్రూప్ లో రెండు పెద్ద జట్లు ఉన్నప్పటికి గ్రూప్-బి లో మాత్రం ఆస్ట్రేలియాకు తిరుగులేకుండా పోయింది. జింబాబ్వే, ఒమన్,ఐర్లాండ్ జట్లు ఆసీస్ కు కనీస పోటీ ఇచ్చే దశలో లేవు. శ్రీలంక కూడా ఇటీవలే ఇంగ్లాండ్ తో టీ20 సిరీస్ ఓడిపోయి ఢీలా పడింది. స్థాయికి తగ్గట్టుగా ఆడితే గ్రూప్ 'బి' లో ఆస్ట్రేలియా ఈజీగా నాలుగు మ్యాచ్ లు గెలిచి అలవోకగా సూపర్-8 బెర్త్ కన్ఫర్మ్ చేసుకునేలా ఉంది. అసలే ఐసీసీ టోర్నీలంటే చెలరేగి ఆడే ఆస్ట్రేలియాకు తమ గ్రూప్ లో చిన్న జట్లు వేయడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఈ గ్రూప్ పై క్రికెట్ ఫ్యాన్స్ అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తుంది. ఇటీవలే శ్రీలంకలో ప్రెస్ కాన్ఫరెన్స్ లో పాల్గొన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ తమ జట్టు టీ20 వరల్డ్ కప్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశాడు. స్టార్ ఆటగాళ్లు స్టార్క్, కమ్మిన్స్ అందుబాటులో లేకపోయినా ఆస్ట్రేలియా జట్టు అత్యంత పటిష్టంగా కనిపిస్తుంది. 2026, ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్ కోసం ఆస్ట్రేలియా శనివారం (జనవరి 31) తమ తుది జట్టును ప్రకటించింది. 15 మంది పేర్లతో కూడిన టీమ్‌ను అనౌన్స్ చేసింది. ఈ మెగా టోర్నమెంట్ కోసం ఆసీస్ ఇప్పటికే తమ తాత్కాలిక జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. వివిధ కారణాలతో తాత్కాలిక జట్టులో పలు మార్పులు చేస్తూ శనివారం తుది జట్టును ప్రకటించింది.

ఈ టీమ్‌లో ప్రధానంగా రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. వెన్ను గాయం కారణంగా పాట్ కమ్మిన్స్ మెగా టోర్నీకి దూరం కాగా అతడి స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌ను ఎంపిక చేసింది. ఇక, తాత్కాలిక జట్టులో ఉన్న మాట్ షార్ట్‌ను తప్పించి అతని స్థానంలో మాట్ రెన్షాను జట్టులోకి తీసుకుంది. సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు.

**2026 టీ20 వరల్డ్ కప్ కు ఆస్ట్రేలియా స్క్వాడ్:**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కొన్నోలీ, టిమ్ డేవిడ్, బెన్ డ్వార్షుయిస్, కామెరాన్ గ్రీన్, నాథన్ ఎల్లిస్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, గ్లెన్ మాక్స్‌వెల్, మాథ్యూ రెన్షా, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా

# నాలుగైదు రోజుల్లో పాకిస్థాన్ దారికొస్తుంది: రవిచంద్రన్ అశ్విన్



- మ్యాచ్ జరిగితే చూడాలని ఆసక్తిగా ఉందన్న రవిచంద్రన్ అశ్విన్
- మ్యాచ్ జరగకుంటే పాకిస్థాన్ భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక
- ఇరుజట్ల మధ్య తటస్థ వేదికల్లో మ్యాచ్‌లు కాబట్టి వేదిక సమస్య కాదని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగితే చూడాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట పాకిస్థాన్ వివాదం వేళ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్, పాకిస్థాన్ మధ్య వంద శాతం మ్యాచ్ జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశాడు. నాలుగైదు రోజుల్లో దాయాది దేశం దారికి వస్తుందని అభిప్రాయపడ్డాడు.వంద శాతం ఇరుదేశాల మధ్య మ్యాచ్ జరుగుతుందని ఆయన అన్నాడు. ఒకవేళ పాకిస్థాన్, భారత్ మధ్య మ్యాచ్ జరగకుంటే ఆ దేశం భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. బ్రాడ్‌కాస్టర్లు కూడా పెద్ద మొత్తంలో నష్టపోతారని, ఆ ప్రభావం అన్ని దేశాల క్రికెట్ బోర్డులపై పడుతుందని అన్నాడు. ఐసీసీ సమావేశంలోనూ ఈ అంశం చర్చకు వస్తుందని పేర్కొన్నాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్) కోసం విదేశీ ఆటగాళ్లకు ఎన్‌ఓసీలు రావని చెప్పాడు.భారత్, పాకిస్థాన్ ఇప్పటికే తటస్థ వేదికల్లో పోటీ పడుతున్నాయని, కాబట్టి ఇక్కడ ఇరుదేశాల మధ్య మ్యాచ్‌లకు వేదిక అనేది కారణం కాదని పేర్కొన్నాడు. ఒక ప్రత్యర్థితో ఆడనని చెప్పడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నాడు. పాకిస్థాన్‌కు ఆ దేశమే శత్రువని, ఇందుకు వారి మైండ్ సెట్ కారణమని అన్నాడు. కాగా, ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచ కప్ 2026 భారత్, శ్రీలంక వేదికగా జరగనుంది. అయితే బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్ ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్‌తో జరగనున్న మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది.

# టీ20 వరల్డ్ కప్ పై ధోనీ ఏమన్నారంటే..!

- ఈసారి అన్నీ ప్రమాదకరమైన జట్లే ఆడుతున్నాయన్న ధోనీ
- టీమ్ ఇండియా మరింత ప్రమాదకరమైన జట్టని వ్యాఖ్య
- పొట్టి ఫార్మాట్ లో ఆటగాళ్లపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని వెల్లడి




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న ఈ పొట్టి ప్రపంచకప్ విజేతగా నిలవబోయే జట్టు ఏదనే దానిపై మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఓ ఇంటర్వ్యూలో ధోనీ మాట్లాడుతూ భారత జట్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈసారి టీ20 వరల్డ్ కప్ లో పాల్గొంటున్న జట్లన్నీ ప్రమాదకరమైనవేనని చెప్పారు.అయితే, అన్ని జట్లలోకి భారత్ మరింత ప్రమాదకరమైన జట్టు అని, మన కుర్రాళ్లు అద్భుతమైన ఫామ్ లో ఉన్నారని చెప్పారు. పొట్టి ఫార్మాట్ లో ఆటగాళ్లపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, భారత జట్టులోని ఆటగాళ్లు అందరికీ ఒత్తిడిలో ఆడిన అనుభవం పుష్కలంగా ఉందని అన్నారు. ఎవరు ఏ పాత్ర పోషించాలో జట్టులోని సభ్యులకు స్పష్టంగా తెలుసని ధోనీ చెప్పారు. మంచి జట్టుకు ఉండాల్సిన లక్షణాలన్నీ టీమ్ ఇండియాలో ఉన్నాయని వివరించారు.

**అదే భయపెడుతోంది..**

మ్యాచ్ జరిగే వేదికల్లో వాతావరణం తనను కలవరపరుస్తోందని ధోనీ చెప్పారు. శీతాకాలం కావడంతో కొన్ని నగరాల్లో మంచు కురుస్తోందని, మ్యాచ్ పై దీని ప్రభావం చాలా ఉంటుందని వివరించారు. ఇది చాలా విషయాలను ప్రభావితం చేస్తుందని, తాను ఆడుతున్న సమయంలోనూ డ్యూ (మంచు) అంటే భయాందోళనలకు గురయ్యానని చెప్పారు. ఇలాంటి సమయంలో టాస్ కీలక పాత్ర పోషిస్తుందని ధోని చెప్పుకొచ్చారు.

# నాని 'డబుల్' దూకుడు.. జోష్ కొనసాగించడం పక్కానా?



సాక్షి మాలిక్ యొక్క ఎఫర్ట్‌లెస్ జనవరి గ్లో



నేచురల్ స్టార్ నాని అంటే టాలీవుడ్ ప్రేక్షకులకు ముందుగా గుర్తుకొచ్చేది సహజమైన నటన, కథలకు ప్రాధాన్యత ఇచ్చే సెలెక్షన్. కెరీర్ ప్రారంభం నుంచే బాయ్ నెక్స్ట్ డోర్ ఇమేజ్ తో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న నాని, ఇప్పుడు స్టార్ హీరోగా మాత్రమే కాదు.. నిర్మాతగానూ తనదైన ముద్ర వేస్తున్నారు. హీరోగా వరుస విజయాలు సాధిస్తున్న ఆ స్టార్, నిర్మాతగా కూడా అదే జోష్ కొనసాగిస్తారా అన్న ఆసక్తి ఇండస్ట్రీలో పెరుగుతోంది. దసరాతో మాస్ అవతార్ లో అదరగొట్టిన నాని, హాయ్ నాన్నతో ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ప్రేక్షకులను కట్టిపడేశారు. ఆ తర్వాత కూడా వరుస హిట్స్ అందుకున్నారు. భిన్నమైన కథలను ఎంచుకుంటూ హిట్స్ అందుకోవడం ఆయన ప్రత్యేకత. ఇప్పుడు ది ప్యారడైజ్ వంటి భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్ట్ తో మరోసారి కొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు.హీరోగా ఆయన కెరీర్ స్పీడ్ చూస్తుంటేడ మరో లెవల్ కు వెళ్లేలా కనిపిస్తోంది. ఇదే సమయంలో నిర్మాతగా కూడా నాని తీసుకుంటున్న నిర్ణయాలు ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వాల్ పోస్టర్ సినిమాస్ బ్యానర్ పై కంటెంట్ బేస్డ్ సినిమాలను నిర్మిస్తూ కొత్త దర్శకులు, కొత్త కథలకు వేదిక కల్పిస్తున్నారు నాని. ఇప్పటికే హిట్ ఫ్రాంచైజ్ తో థ్రిల్లర్ జానర్ లో మంచి బ్రాండ్ క్రియేట్ చేశారు. ప్రతి పార్ట్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తూ కమర్షియల్ సక్సెస్ సాధించింది. అలాగే చిన్న సినిమాగా వచ్చిన కోర్ట్ అనూహ్యంగా బాక్సాఫీస్ వద్ద లాభాలు తెచ్చిపెట్టింది. తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఆ చిత్రం 2025లో అత్యధిక లాభాలు సాధించిన చిన్న చిత్రాల్లో ఒకటిగా నిలవడం విశేషం. దీంతో నిర్మాతగా నాని కథలపై పెట్టే నమ్మకం, ప్లానింగ్ ఎంత పక్కాగా ఉందో మరోసారి రుజువైంది. 2026లో నిర్మాతగా నాని నుంచి ఎలాంటి సినిమాలు లేకపోయినాడ 2027 కోసం మాత్రం భారీ ప్లాన్ రెడీ చేస్తున్నారట.ఒకేసారి మూడు ప్రాజెక్టులను లైనప్ లో పెట్టడం విశేషం. అందులో ఒకటైన హిట్ 4లో తమిళ స్టార్ కార్తీ హీరోగా నటించనున్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కనున్న ఆ చిత్రం పై భారీ అంచనాలు ఉన్నాయి. కోర్ట్ దర్శకుడు రామ్ జగదీష్ తో మరో సినిమా ప్లాన్ చేస్తుండగా, దుల్కర్ సల్మాన్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయి. తన సోదరి దీప్తి ఘంటా దర్శకత్వంలో ఒక చిన్న బడ్జెట్ సినిమా కూడా నిర్మించబోతున్నారు నాని. మొత్తానికి హీరోగా వరుస హిట్స్ తో దూసుకుపోతున్న నానిడ నిర్మాతగా కూడా అదే సక్సెస్ ట్రాక్ కొనసాగిస్తారా అన్న చర్చ మొదలైంది. కథలపై నమ్మకం, కొత్త టాలెంట్ కు అవకాశం, కంటెంట్ కు ప్రాధాన్యత.. ఇవన్నీ చూస్తుంటే వాల్ పోస్టర్ సినిమాస్ బ్యానర్ నుంచి మరోసారి విజయాల పరంపర కొనసాగడం ఖాయమే అనిపిస్తోంది. హీరోగానే కాదు.. నిర్మాతగానూ నాని డబుల్ దూకుడు చూపించడానికి సిద్ధమయ్యారనే చెప్పాలి.



పాలక్ తివారీ యొక్క బ్లాక్ గ్లామ్ మూమెంట్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965